
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 15.04.2016, శుక్రవారం
సంపుటి : 35 సంచిక : 46
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# నారా కుటుంబంలో నందమూరి చిచ్చు

## • యుద్ధం మొదలైంది



**నందమూరి కుటుంబానికి అల్లుడు కావడం వల్లే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగలిగాడు. ఆయన రాజకీయ భవిత్యానికి ప్రధాన మార్గం నందమూరితో బంధుత్వమే. అయితే ఏ కుటుంబం వల్ల ఆయన ఈ స్థాయిలో ఉన్నాడో అదే కుటుంబాన్ని ఆయన అంచెలంచెలుగా తొక్కుతూ వస్తున్నాడు.**

మొదట ఎన్టీఆర్‌కు పొగపెట్టాడు. ఆ తర్వాత తోడల్లుడు దగ్గుపాటి వెంకటేశ్వర రావును వెళ్ళగొట్టాడు. ఇక ఎన్టీఆర్ వారసులెవరినీ రాజకీయాలలో నిలువ కుండా చేశాడు. నందమూరి కుటుంబ సభ్యులను ఏ స్థాయిలో వాడుకోవాలో ఆ స్థాయిలో వాడుకుని పక్కన పడేసాడు. నందమూరి హరికృష్ణను ఎందుకు పనికి రాకుండా చేశాడు. జూనియర్ ఎన్టీఆర్‌ను వాడుకుని పక్కన పెట్టేశాడు. బాలకృష్ణ ఇమేజ్‌ను వాడుకోవడానికి వియ్యంకుడిని చేసుకున్నాడు. నందమూరి కుటుంబసభ్యులతో తనకు ఎలాంటి సమస్యలూ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాడు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా పదవుల విషయంలో నందమూరి కుటుంబసభ్యుల నుండి అప్పుడప్పుడు సమస్యలు వస్తూనే వున్నాయి. ముఖ్యంగా హిందూపురం ఎమ్మెల్యేగా వున్న బాలకృష్ణ, ప్రస్తుతం మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్నాడు. ఇటీవల లేపాక్షి ఉత్సవాలను ఆయన ఆధ్వర్యంలో బ్రహ్మాండంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల ఊపుతో పర్యాటక శాఖ ఇస్తే చాలాబాగా చేస్తానని బాలకృష్ణ తన మనసులో మాట చెప్పాడు. బాలకృష్ణను మంత్రివర్గంలోకి తీసుకుంటే డామినేట్ చేస్తాడని చంద్రబాబు భయం. అందుకే తెలివిగా మంత్రివర్గంలోకి లోకేష్ అన్న ప్రచారాన్ని వదిలాడు. లోకేష్‌ను మంత్రిని చేయాలంటూ తన పార్టీ నాయకుల చేతే డిమాండ్ చేయించాడు. లోకేష్‌ను మంత్రి వర్గంలోకి తీసుకుంటే ఇక బాలకృష్ణకు ఛాన్సుండదు. ఎందుకంటే తండ్రి సీఎం, కొడుకు, వియ్యంకుడు మంత్రులు అంటే... చెప్పుకోవడానికి కూడా బాగుండదు. అదీగాక బాలకృష్ణ దూకుడును తగ్గించాలన్నది చంద్రబాబు ఆలోచన. ప్రజలు కోరుకుంటే, పార్టీ ఆదేశిస్తే సీఎం పదవిని చేపట్టడానికైనా సిద్ధమేనని ఈమధ్య బాలకృష్ణ స్టేట్‌మెంట్ ఇచ్చి వున్నాడు. అప్పటి నుండి చంద్రబాబులో జాగ్రత్త పెరిగింది.

(మిగతా 10వ పేజీలో)

లాయర్
శ్రీరామ నవమి సంబరాలు
పెళ్ళిపుస్తకం ఆవిష్కరణ
ఏప్రియల్ 15, 2016, సా॥ 6 గంటల నుండి
టౌన్‌హాలు, నెల్లూరు.
వివరాలు 3వ పేజీలో...







## • విస్తరణ జరగనుంది



# రేసులో ఆ నలుగురు

***నారా లోకేష్ కోసమైనా చంద్రబాబు త్వరలో మంత్రివర్గంలో మార్పులు చేర్పులు చేసే అవకాశాలున్నాయి. అయితే ఒక్క లోకేష్‌నే తీసుకుంటే కేవలం కొడుకు కోసమే మంత్రివర్గ విస్తరణ చేసాడనే చెడ్డ పేరొస్తుంది. కాబట్టి మరి కొందరికి కూడా విస్తరించవచ్చు. కొత్తగా తీసుకునే మంత్రుల్లో ఎస్సీ, బి.సి, మైనార్టీలతో పాటు రెడ్డి సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తారని టాక్!***

రెడ్లకు కనీసం రెండన్నా మంత్రి పదవులు దక్కొచ్చు. చంద్రబాబు కేబినెట్‌లో ఇప్పుడు ఇద్దరు మాత్రమే రెడ్లున్నారు. ఇప్పుడు రెడ్ల ప్రాబల్యం వున్న జిల్లాల మీద చంద్రబాబు దృష్టి పెట్టాడు. ఈ జిల్లాల్లోని వైకాపా ఎమ్మెల్యేలనే ఎక్కువుగా తెలుగు దేశంలోకి లాగుతున్నాడు. మంత్రివర్గంలో రెడ్లకు స్థానం కల్పించాలనుకుంటే కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను పరిగణలోకి తీసుకోవాలి. కర్నూలులో భూమా నాగిరెడ్డి, కడపలో ఆదినారాయణరెడ్డిలు ఇటీవలే వైకాపా నుండి తెలుగు దేశంలో చేరారు. ఆదినారాయణరెడ్డికి డౌటే గాని, భూమా నాగిరెడ్డిని మాత్రం మంత్రి పదవి ఆఫర్‌తోనే తెలుగుదేశంలో చేర్చుకున్నారనే ప్రచారం వుంది. మరి శిల్పా సోదరులు భూమాను గట్టిగా వ్యతిరేకిస్తే

(మిగతా 10వ పేజీలో)



# చైతన్యవంతుల పార్క్!



నెల్లూరులోని వేదాయపాలెంలోని చైతన్యపురికాలనీ వాసులు తమ కాలనీ పేరుకు తగ్గట్లుగానే చైతన్యవంతులయ్యారు. ఎవరో వస్తారు, ఏదో చేస్తారు అని ఆశించకుండా తమలో తామే తలో చేయి వేసుకున్నారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారం తీసుకున్నారు. స్థానికుడు, దాత గడ్డం రత్నంచౌదరి దాతృత్వంతో ఇక్కడ ఓ అందమైన పార్కును నిర్మించుకున్నారు. అంతకుముందే స్థానికులు సొంతంగా ఒక పార్కును ఏర్పాటు చేసుకున్నారు. అభివృద్ధి చేసిన రెండో పార్కును ఇటీవల నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ కాలనీవాసులను ఎంపి మేకపాటి, ఎమ్మెల్యే కోటంరెడ్డిలు అభినందిస్తూ, చైతన్యపురి కాలనీ వాసులను ఆదర్శంగా తీసుకుని నగరంలోని ప్రతి ప్రాంత ప్రజలు నిరుపయోగంగా వున్న రిజర్వు స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా అధికార ప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, సాయి సునీల్, రమణారెడ్డి, అనంతరాజు, కొండారెడ్డి, లక్ష్మారెడ్డి, మహేష్‌నాయుడు, వేణుగోపాల్, ఆదినారాయణరెడ్డి, మురారి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# హరిబాబుకు ఉగాది పురస్కారం



నెల్లూరుకు చెందిన హాస్యనటుడు దోర్నాల హరిబాబుకు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం లభించింది. ఉగాది రోజు విజయవాడలో నిర్వహించిన ఉగాది వేడుకలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకోవడం జరిగింది. అలాగే నెల్లూరుకు చెందిన మరో మిమిక్రీ కళాకారుడు మైపాడు రాజా కూడా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు.

# పసుపు చొక్కా ధరించిన పెంచలరెడ్డి




ఒకప్పుడు ఆనం సోదరులకు ఐదవ తమ్ముడిగా పేరుగాంచిన మాజీ కార్పొరేటర్, ఆంధ్రప్రదేశ్ ఎడిబుల్ ఆయిల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశంలో చేరిపోయాడు. ఒకప్పుడు జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఆనం కాంగ్రెస్, నేదురుమల్లి కాంగ్రెస్, పనబాక కాంగ్రెస్, మాగుంట కాంగ్రెస్, మేకపాటి కాంగ్రెస్... అని ఉండేది. ఇవతల పార్టీ నుండి వెళ్లే వాళ్లు తమకిష్టమొచ్చిన నాయకుడి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేవాళ్లు. ఇప్పుడు కాంగ్రెస్‌లో వున్న ఆ నాయకులే చాలావరకు తెలుగుదేశంలోకి వచ్చారు. కాబట్టి ఇక్కడ ఆనం తెలుగుదేశం, ఆదాల తెలుగుదేశం, సోమిరెడ్డి తెలుగుదేశం, నారాయణ తెలుగుదేశం, బీద తెలుగుదేశం అనే పార్టీలు ఏర్పడ్డాయి. ఎవరికిష్టం వచ్చిన నాయకత్వాలలో వాళ్లు చేరుతుంటారు. ఈమధ్యనే ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరగా పెంచలరెడ్డి సోదరుడైన సుబ్బారెడ్డి వారి వెంట వెళ్లాడు. పెంచలరెడ్డికి తన అన్నతో పడదు. కాబట్టి ఆనం తెలుగుదేశంలో చేరలేదు. ఇప్పుడు ఆదాల తెలుగుదేశంలో చేరాడు. సన్నపరెడ్డి పెంచలరెడ్డి పక్కా వై.యస్. అభిమాని. జగన్‌తో సన్నిహితం వుంది. అయినా వై.యస్.తో అత్యంత సన్నిహితంగా వున్న వారు కూడా తెలుగుదేశంలో చేరిపోయారు. కాబట్టి పెంచలరెడ్డి చేరడం పెద్ద లెక్కలోకి రాదు.

2014 ఎన్నికలకు ముందు దాకా పెంచలరెడ్డి ఆనం సోదరులతోనే వున్నాడు. ఆ ఎన్నికలకు ముందు ఆనంను వదిలి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరేటప్పుడు పిలిచుండుంటే ఆయన వారితో వెళ్లుండేవాడు. కాని వాళ్లు కావాలనే పిలవకుండా పెంచలరెడ్డిని దూరంగా పెట్టడం కోసం వాళ్ల అన్న సుబ్బారెడ్డిని తీసుకెళ్లారు. మీకు నేను అక్కరలేనప్పుడు నా దారి నాకుంటుందంటూ పెంచలరెడ్డి ఆదాల దారి పట్టాడు.

## అవినీతిపరుల గుండెల్లో

# పేలుతున్న తూ(తో)టా



**అప్పుడెప్పుడో పదిహేనేళ్ల క్రితం ఏసిబి డిఎస్పీ వివిఎస్ఆర్ చౌదరిని చూసాం... అవినీతిపరుల గుండెల్లో సింహస్వప్నం అంటే అతనే! లంచగొండుల ప్యాంట్లు తడిచేలా చేశాడు. ఏ అధికారయినా లంచం తీసుకుంటుంటే వివిఎస్ఆర్ చౌదరి రూపం కళ్లముందు కనిపించేది. చిన్నస్థాయి ఉద్యోగి నుండి పైస్థాయి అధికారి దాకా ఏ అవినీతి జలగను కూడా ఆయన వదల్లేదు. ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా మాటు వేసి అవినీతి చేపను పట్టేవాడు.**

నెల్లూరుజిల్లాలో మళ్లీ అటువంటి పనితీరును చూస్తున్నాం. ఆరోజు వివిఎస్ఆర్ చౌదరి... ఈరోజు తోట ప్రభాకర్‌రావు. పోస్టు అదే... నిబద్ధత అదే. నిజాయితీ అదే. అవినీతి అంతు చూడాలన్న పంతం అదే! అవును జిల్లాలో అవినీతి నిరోధక శాఖ పనితీరు బాగుంది. చిత్తశుద్ధితో పని చేసే అధికారుండాలే గాని... ఏ శాఖలో అయినా సత్ఫలితాలు వస్తాయన్నదానికి తోట ప్రభాకర్ ఒక ఉదాహరణ. ఆయన ఏసిబి డిఎస్పీగా వచ్చాకే అవినీతి అధికారుల గుండెల్లో గుర్రాలు దౌడుతీస్తున్నాయి. ఇటీవల కాలంలోనే నలుగురు తహశీల్దార్లు, ఒక సబ్‌రిజిస్ట్రార్, ఒక ట్రాఫిక్ సి.ఐ... అవినీతి చేపలను వరుసగా పట్టేశారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఆరోపణలున్న ప్రతి అధికారి ఇళ్ల మీద దాడులు నిర్వహిస్తున్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా వున్న భీములవారిపాలెం చెక్‌పోస్టుపై తరచూ దాడులు జరుపుతున్నాడు. ఇటీవల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు జరిపి ఒక రోజంతా తనిఖీలు నిర్వహించి అవినీతిపరుల ఛందాలు వలవడం చూశాము.

ప్రభుత్వశాఖలంటే ప్రజల్లో ఒకరకమైన అసహ్యం వుంది. ఎవరూ పని చేయరు, లంచాల కోసం పీడిస్తుంటారనే పేరుంది. ఇలాంటి వాతావరణంలో కూడా ప్రభుత్వ శాఖల పనితీరుపై ప్రజల్లో నమ్మకం కలిగించే తోట ప్రభాకర్ లాంటి నిజాయితీ తూటాలుండడం సంతోషించదగ్గ విషయమే!

సింహపురి సమాచారం

## ఉత్సాహంగా... ఉల్లాసంగా

# పెన్నాలో 8కె స్విమ్





పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఉదయం జొన్నవాడ వంతెన నుండి రంగనాయకులపేట పెన్నా పొర్లు కట్ట వరకు నిర్వహించిన 8కె స్విమ్ విజయవంతమైంది. 14ఏళ్ల మొదలుకొని 70ఏళ్ల వరకు మొత్తం 74మంది ఈ స్విమ్మింగ్ యాత్రలో పాల్గొన్నారు. ఉదయం 6.45గంటలకు జొన్నవాడ వంతెన వద్ద నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పచ్చజెండా ఊపి 8కె స్విమ్‌ను ప్రారంభించాడు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ పై ప్రజలలో అవగాహన తెచ్చేందుకు 8కె స్విమ్ కార్యక్రమాన్ని చేపట్టిన పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్యను, 8కె స్విమ్‌లో పాల్గొన్న సభ్యులను కోటంరెడ్డి అభినందించారు. తర్వాత స్విమ్మర్స్ ఒక ర్యాలీగా ఈత కొడుతూ 10.15గంటలకు పెన్నా పొర్లు కట్ట వద్దకు చేరుకున్నారు.

శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇక్కడ స్విమ్మర్స్‌కు స్వాగతం పలికి ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈతగాళ్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తెలుగుదేశంపార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సాయం మించిన దైవం లేదు!

## • సాయి దర్బార్‌లో రక్తదాన శిబిరం



దేవాలయంలో ఉత్సవాలనగానే హోమాలు, అభిషేకాలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాదాల పంపిణీ... చాలా మందికి తెలిసిన పని ఇదే! దేవాలయాలు మానసిక ప్రశాంతత కేంద్రాలు. అదే సమయంలో మానవసేవా కేంద్రాలు కూడా! మానవసేవే మాధవ సేవ అని ఆ దేవుడే చెప్పాడు. కాబట్టి దేవాలయాలను సైతం సాటి మనిషికి సాయం చేసే మానవతా కేంద్రాలుగా మార్చాల్సిన అవసరముంది.

ఇలాంటి ప్రయత్నాన్ని నెల్లూరులో మొట్టమొదటగా మొదలుపెట్టింది బాలాజీ నగర్, పద్మావతినగర్‌లోని సాయిబాబా అద్దాల మందిరం వారే! ఇక్కడ ప్రతి యేటా శ్రీరామనవమి ఉత్సవాలు జరుపుతుంటారు. ఈ ఉత్సవాలలో భాగంగా ఒక రోజు భక్తులంతా కలిసి రక్తదానం చేస్తుంటారు. గుళ్లల్లో సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలు జరగవు. కాని అద్దాల మందిరం వాళ్లు ఈ పనికి కొన్నేళ్ల క్రితమే శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో భాగంగానే ఆదివారం సాయిబాబా అద్దాల మందిరం వద్ద మందిర నిర్వాహకులు మధుసాయి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ వైద్యులు డాక్టర్ సాయినాధ్ బృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగగా 63మంది భక్తులు రక్తదానం చేశారు.

## మానవత్వానికి చిరునామా

# ఎపిలెప్సీ యాప్!









నెల్లూరుజిల్లా ప్రజలు మా వాడు అని గర్వంగా చెప్పుకోగల గాయకుడు గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. ఆయన పాట ఉత్తేజాన్నిస్తే, ఆయన మాట చైతన్యం తెచ్చేలా వుంటుంది. 'పాడుతా తీయగా', 'స్వరఝరి' వంటి టీవీ కార్యక్రమాలలో ప్రతి సందర్భంలోనూ ఆయన పాటలతోనే కాకుండా మంచి మాటలతో అలరిస్తుంటారు. ప్రజలకు ఉపయోగపడతాయి, పది మందికి మంచి జరుగుతుందంటేనే ఆయన ఏ కార్యక్రమానికైనా హాజరవుతుంటారు. ఆయన వక్తగా, వ్యక్తిగా, ముఖ్యఅతిథిగా ఏదన్నా కార్యక్రమంలో పాల్గొన్నాడు అంటే ఆ కార్యక్రమం స్థాయి చాలా ఉన్నతంగా వుంటుంది. ప్రారంభోత్సవాలు, సభలు, సమావేశాలకు ఆయన సామాన్యంగా రాడు. అలాంటి ఎస్పీ బాలు ఈ నెల 10వ తేదీన నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ బిందుమీనన్ స్థాపించిన బిందుమీనన్ ఫౌండేషన్ రూపొందించిన ఎపిలెప్సి యాప్‌ను ఆయన ఆరోజు రాత్రి నెల్లూరు పురమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. డాక్టర్ బిందు మీనన్ కూడా ఈ ఎపిలెప్సీ యాప్ ఆవిష్కరణకు సరైన వ్యక్తి ఎస్పీ బాలూయేనని భావించి ఆయనను ఆహ్వానించారు. మూర్ఛవ్యాధిగ్రస్తులను ఆదుకునే ఓ మంచి ఆశయంతో ఈ యాప్‌ను రూపొందించారు కాబట్టి బాలూ కూడా తన బిజీ కార్యక్రమాలను పక్కనపెట్టేసి రావడం జరిగింది. ఈ యాప్ రూపకల్పనకు కృషి చేసిన డాక్టర్ బిందుమీనన్ మానవతా దృక్పథాన్ని ఆయన అభినందించారు.

ఈ యాప్‌ను బాలూ చేతులమీదుగా ఆవిష్కరించడం తన జీవితంలో మధురఘట్టంగా డాక్టర్ బిందు చెప్పుకున్నారు. ఈ వేదికపై డాక్టర్ బిందుతో పాటు ఆమె తల్లిదండ్రులు నంబియార్, భార్గవి నంబియార్‌లు బాలును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సినీ రచయిత వెన్నెలకంటి, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## • నెల్లూరుకు.. కార్పొరేట్ మా(ళ్)ల



నెల్లూరు స్థాయి పెరుగుతుంది. టౌన్ నుండి సిటీ... సిటీ నుండి మెగా సిటీగా మార్పు చెందుతోంది. మహానగరాలలో ఉండే కార్పొరేట్ వ్యాపార వ్యవస్థలన్నీ కూడా నెల్లూరులో కొలువు దీరుతున్నాయి. పాతకాలం నుండి కూడా నెల్లూరుకు క్లాస్ సిటీ అనే పేరుంది. మార్కెట్‌లోకి ఎంత ఖరీదైన కార్లు వచ్చినా చెన్నై, హైదరాబాద్‌ల తర్వాత అవి ఎక్కువుగా కనపడేది నెల్లూరు రోడ్ల మీదే! ఇక సినిమాహాల్స్ పరంగా అయితే నెల్లూరుకు వున్న పేరు చెప్పనవసరం లేదు. గతంలోనే నెల్లూరులో వున్నంత హైక్లాస్‌గా సినిమా థియేటర్లు ఇంకెక్కడా వుండేవి కావు. మన థియేటర్లు అంత బాగా వుండేవి. ఇప్పుడు ఆ థియేటర్లనే ఇంకా ఆధునీకరించడం చూసాం. రాఘవ సినీ కాంప్లెక్స్‌తో పాటు లీలా మహల్, అర్చన వంటి థియేటర్లు అత్యాధునికంగా నిర్మించడం తెలిసిందే! ఇక మహానగరాలలో వుండే ఫుడ్‌కోర్టులు, హోటళ్లు నెల్లూరుకు వచ్చేశాయి. నెల్లూరుకు మరింత కార్పొరేట్ సొగసులద్దుతూ దర్గామిట్ట వద్ద నిర్మాణంలో వున్న యం.జి.బ్రదర్స్ మల్టీప్లెక్స్ మాల్ కూడా త్వరలోనే ప్రారంభానికి నోచుకోబోతోంది. ఈ మాల్‌లో ఐదు సినిమా థియేటర్లతో పాటు మెక్‌డోనాల్డ్, బరిస్టా వంటి అంతర్జాతీయ ఫుడ్ కోర్టులు, మరెన్నో ఇంటర్నేషనల్ బ్రాండ్స్‌తో షాపులు ప్రారంభం కానున్నాయి.

నెల్లూరులో డబుల్ సెల్లార్ పార్కింగ్‌తో కట్టిన మొట్టమొదటి నిర్మాణం ఇదే! కాగా, దీని పక్కనే పాత వెంకటరమణ థియేటర్స్ స్థానంలో ఎన్ఆర్ మల్టీప్లెక్స్ కూడా శరవేగంగా నిర్మాణం జరుపుకుంటోంది. ఈ రెండు మాల్స్ ప్రారంభమైతే ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. నగరం మరింత రద్దీగా మారుతుంది. షాపింగ్ ప్రియులకు ప్రతిరోజూ పండుగే!


ఆహ్వానము

## శ్రీరామ నవమి సంబరాలు



లాయర్
వారపత్రిక ఆధ్వర్యంలో
తే.15.04.2016ది శుక్రవారం
సాయంత్రం 6 గంటల నుండి
నెల్లూరు, ఆర్.యల్.రెడ్డి పురమందిరం
(టౌన్‌హాల్) నందు
శ్రీరామ నవమి సంబరాలు
నిర్వహించబడును.

ఈ సందర్భంగా...
భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ఆలవాలమైన
"వివాహ వ్యవస్థ" ప్రాశస్త్యాన్ని తెలుపుతూ
శ్రీరస్తు.. శుభమస్తు... కళ్యాణమస్తు... అంటూ లాయర్ ప్రచురించిన
పెళ్ళిపుస్తకం
ఆవిష్కరణ

అన్యోన్య దాంపత్య జీవితంలో
స్వర్ణోత్సవం జరుపుకున్న ఆదర్శదంపతులకు
వేద పండితుల ఆశీర్వచనం

మధురమైన
పెళ్ళి పాటలతో
సినీ సంగీత సందడి

ఈ సంబరంలో...


శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
శాసన మండలి సభ్యులు


శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
శాసనసభ్యులు, నెల్లూరు గ్రామీణం


శ్రీమతి యం.జానకి, ఐఏఎస్
ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా కలెక్టర్


శ్రీ విశాల్ గున్ని, ఐపిఎస్
నెల్లూరుజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్


శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
ప్రముఖ దాత మరియు పారిశ్రామికవేత్త


శ్రీమతి దీపా వెంకట్
మేనేజింగ్ ట్రస్టీ, స్వర్ణభారత్ ట్రస్ట్

ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు.

వేదపండితుల ఆశీర్వచనాలు అందుకోనున్న
పుణ్యదంపతులు

శ్రీ జె.వి.రెడ్డి - శ్రీమతి జానకమ్మ
శ్రీ బెజవాడ దశరధరామిరెడ్డి - శ్రీమతి అన్నపూర్ణమ్మ
శ్రీ గ్రోసు గోపాలయ్య - శ్రీమతి శాంతమ్మ
శ్రీ కె.వి.చలమయ్య - శ్రీమతి శకుంతలమ్మ
డాక్టర్ బి.సుందరరామిరెడ్డి - శ్రీమతి అరవిందమ్మ
శ్రీ జె.కె.రెడ్డి - శ్రీమతి సులోచనమ్మ
డాక్టర్ పి.మధుసూదనశాస్త్రి - శ్రీమతి రాజ్యలక్ష్మి
శ్రీ జె.వి.నారాయణమూర్తి - శ్రీమతి భవాని
శ్రీ వేమారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి - శ్రీమతి సుజాతమ్మ
శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి - శ్రీమతి సులోచనమ్మ
శ్రీ కె.వి.రత్నం - శ్రీమతి పద్మావతమ్మ
శ్రీ నంబూరు మోహన్‌రావు - శ్రీమతి సులోచనమ్మ
శ్రీ సామంతు గోపాల్‌రెడ్డి - శ్రీమతి మధుసూదనమ్మ
శ్రీ పి.రాజగోపాల్‌రెడ్డి - శ్రీమతి ఇందిరమ్మ
శ్రీ ఎన్.వి.రమణయ్య - శ్రీమతి అనసూయమ్మ

అందరూ ఆహ్వానితులే..

# 'ప్రభా'తం

భక్తజనమంతా ఎంతో సందడిగా ఆనందోత్సాహాలతో జరుపుకునే వేడుకలు కూడా ఒక్కోసారి ప్రమాదాల పాలై విషాదానికి గురిచేస్తున్నాయంటే.. నిజంగా దురదృష్టమేననుకోవాలి. అందులోనూ అలాంటి దుర్ఘటనలు ఆలయాల వద్ద కూడా జరగడం దారుణం. కేరళలోని పుట్టింగళ్ ఆలయం ప్రాంగణంలో జరిగిన బాణసంచా పేలుడు దుర్ఘటనలో మానవతప్పిదం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏదో పొరపాటునో గ్రహపాటునో ఏ ప్రమాదమో జరిగితే అది వేరే విషయం కానీ, ఎంతోమంది భక్తులు అలాంటి దుర్ఘటనకు ఆహుతైపోవడమే ఎవరూ జీర్ణించుకోలేని విషయం. అందులోనూ ఆ ఆలయం ఎంతో ప్రసిద్ధమైన దేవాలయం. పుట్టింగళ్ ఆలయం అంటే కేరళలోని కొల్లాం జిల్లా పరవూర్ పట్టణంలోని ఒక పుట్టలో స్వయంభువుగా వెలసిన దేవతకే గుడి కట్టి ఆరాధిస్తున్నారు. ప్రతి ఏటా ఇక్కడ అమ్మవారి జన్మనక్షత్రమైన భరణి నక్షత్రం రోజున ఎంతో వైభవంగా నిర్వహించే ఈ వేడుకలకు కేరళలోని అనేక ప్రాంతాల నుంచి భక్తజనం పోటెత్తు తారు. ఆలయప్రాంత మంతా భక్తజనసందోహంతో క్రిక్కిరిసిపోయి వుంటుంది. ఈ సందర్భంగా 'మత్సర కంబం' అనే పేరుతో అక్కడ బాణసంచా ప్రదర్శనల పోటీలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. ఇప్పుడా భారీ సంబరమే ఇంతటి ఘోరమైన దుర్ఘటనకు దారి తీసింది. ఇలాంటి పోటీలు ఎక్కడో దూరంగా, ఎవరికీ ప్రమాదం లేకుండా జరిగితే అది వేరే సంగతి. ఆలయ ప్రాంగణంలోనే, టపాసుల గోడౌన్ చెంతనే భారీగా టపాసులు పేల్చి చేతులారా ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లయింది. చేతిలో టపాసు పెట్టుకుని కాల్చుకున్నట్లుగా పక్కనే బాణసంచా గోడౌన్ పెట్టుకుని భారీఎత్తున టపాసులు పేల్చితే ఏమవుతుంది?..ఏదైతే జరగకూడదని భావిస్తామో అంతటి ఘోరమే జరిగిపోయింది. ఆ ఘోరం జరిగిన తీరును పరిశీలిస్తే, ఇది విధి విలాసం కాదు..మానవ నిర్లక్ష్య మన్నట్లుగానే అనిపిస్తుంది ఎవరికైనా!. భారీఎత్తున బాణసంచా కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి పక్కనే వున్న బాణసంచా గోడౌన్‌మీద పడి..పెద్దఎత్తున పేలుళ్ళతో, చెలరేగిన మంటలతో ఆలయ ప్రాంగణం అగ్నిగోళంలా మండిపోతున్నట్లు కనిపించింది. భారీ విస్ఫోటనాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. వేకువఝామున జరిగిన ఈ బాణసంచా పేలుళ్ళతో ఆ ప్రాంతమంతా భీభత్సంగా మారింది. విరుచుకుపడిన మంటలంటుకుని కొంతమంది హాహాకారాలు చేస్తూ ఆ మంటల్లో కాలిపోయారు..మలమలా మాడిపోయారు. అటు అగ్నికీలల ధాటికి, ఇటు పేలిపోతున్న గోడౌన్ నుంచి ఎగిరివచ్చిన శకలాల తాకిడికి వందలాది మంది భక్తులు గాయాలతో విలవిలలాడిపోయారు. ఈ దుర్ఘటనలో మొత్తం 109 మంది భక్తులు మృత్యువాత పడ్డారంటే పరిస్థితి ఎంత భయానకంగా జరిగిందో వూహించుకోవచ్చు. ఆలయ ప్రాంగణంలోని కట్టడాలు ఈ ప్రేలుళ్ళ ధాటికి నేలమట్టమైపోయాయి. ఎటుచూసినా రక్తసిక్తమైన మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. కాగా, ఇక్కడున్న స్థానికులు కొంతమంది ఈ బాణసంచా దద్దరింపులతో దడ పుడుతోందని, వాటిని నిలపాలని గతంలో కూడా అధికారులను కోరివున్నట్లు తెలుస్తోంది. అయినా, ఆ సంబరాలు అలా జరిగిపోతూనే వున్నాయి. ఈ దుర్ఘటన జరిగిన రోజున కూడా బాణసంచా పేలుళ్లు ఆపాలని పోలీసులు నిర్వాహకులను ఆదేశించినా..చివరికి జరగకూడని ఘోరమే జరిగిపోయింది. పేలుళ్ళు ఆపేలోగానే.. ఇక ఎవరూ ఆపలేనంత.. ఇక ఆపాల్సిన అవసరమే లేనంత ఘోర దుర్ఘటనే జరిగిపోయింది. ఇక పేలడానికి అక్కడ ఏ ఒక్క బాణసంచా పుల్ల కూడా మిగలకుండా అంతా కాలి.. బూడిదైపోయింది. సంబరమంతా..విషాద సంభరితమైంది. ఉత్సాహమంతా నేలకరుచుకుపోయింది. ఈ దుర్ఘటన సమాచారం తెలిసిన వెంటనే ప్రధాని నరేంద్రమోడీ ఆలయ ప్రాంతాన్ని సందర్శించడం, తనతో పాటు విమానంలో వైద్యుల బృందాన్ని కూడా తీసుకొచ్చి వెంటనే బాధితులకు చికిత్సలు ప్రారంభించడం బాధితులకు ఎంతో ఊరటనిచ్చింది. ఏదేమైనప్పటికీ, ఆలయాల్లోనూ, ఆలయ పరిసర ప్రాంతాల్లోనూ అప్రమత్తంగా లేకపోవడం వల్లనే ఇలాంటి దుర్ఘటనలు తరచూ జరుగుతున్నాయన్నది అందరికీ తెలిసిన సత్యమే.

అయినా, ఏ వేడుకలనూ..ప్రజల ఉత్సాహాన్నీ ఎప్పుడూ..ఎవరూ కాదన లేరు. అయితే, ఆ వేడుకలు విషాదం కాకూడదన్నదే అందరి భావన. ప్రజలు, భక్తులు సంతోషంగా, క్షేమంగా వుండాలన్నదే అందరి ఆలోచన. అందులోనూ బాణసంచా వేడుకల వంటి ప్రమాదకరమైన సంబరాల పట్ల అందరికీ మరింత అప్రమత్తత అవసరం. ఈ దుర్ఘటనను ఒక గుణ పాఠంగా తీసుకోవాలి. బాణసంచా పేల్చడం గానీ, ఆ నిల్వలను భద్రపరచడం కానీ ఎవరికీ ప్రమాదం లేనిచోట దూరంగా వుంచాలే తప్ప, ఆలయ ప్రాంగణాల్లోనో.. జనసమ్మర్దం వున్న ప్రాంతాల్లో కాదు. ఇకనైనా ఆలయ అధికారులు, నిర్వాహకులు, పోలీసులు, పరిసరాల ప్రజలు కూడా ఈ వేడుకల పట్ల మరింత అప్రమత్తంగా వుండాలి.

ఏ వేడుకలైనా సరే, సంతోషంతో జరగాలే తప్ప ప్రమాదాలతో కాదు. నియమ నిబంధనలు పట్టించుకోకుండా, నిర్లక్ష్యంతో మితిమీరిన ఉత్సాహంతో చేసే ఇలాంటి సంబరాలు చివరికి అభంశుభం తెలియని భక్తుల ప్రాణాలమీదికి రావడం నిజంగానే దురదృష్టకరం. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఆయా రాష్ట్రప్రభుత్వాలు, కేంద్రం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి వుంది. ఆలయాల్లో తొక్కిసలాటలు జరగడం, ప్రమాదాలు జరగడం వంటి సంఘటనలన్నింటినీ ఒకసారి సమీక్షించాల్సివుంది. ఆలయాల అధికారులు, నిర్వాహకులు, పోలీసు వ్యవస్థ, ఆయా ప్రాంతాల్లోని అధికారయంత్రాంగం అంతా కలసి..ఆలయాల వద్ద భక్తులకు, ప్రజలకు ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ లేని పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి వుంది. అందుకు ఆలయాల నిర్వాహకులు, ప్రజలు అందరూ సహకరించాల్సివుంది.



## విషాద వేడుక

కేరళలోని పుట్టింగళ్ ఆలయం వద్ద జరిగిన దుర్ఘటనలో 109 మంది భక్తులు ప్రాణాలు కోల్పోవడం, మరో 383 మంది గాయాలపాలు కావడం దురదృష్టకరం. ఆలయ ప్రాంతం వద్ద నిబంధనలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా బాణసంచా పేలుళ్ళు జరగడం దారుణం. ఏ వేడుకలైనా సంతోషంగా జరగాలే తప్ప విషాదాంతం కాకూడదు. దీనినొక గుణపాఠంగా తీసుకుని, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

# మోడల్ ఎంసెట్ నిర్వహణ భేష్



విద్యార్థుల్లో ఉన్న ఆందోళనలను పోగొట్టడంతో పాటు నామమాత్రపు ఫీజుతో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్‌ను నిర్వహించడం అభినందనీయమని డివిఇఓ వెంకయ్య అన్నారు. నెల్లూరు బాలాజీనగర్‌లోని ఎన్నార్ఐ కళాశాలలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ ఎంసెట్ ప్రశ్నాపత్రాలను డివిఇఓ వెంకయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలనాయుడు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 23సెంటర్లలో ఎంపిసికి 2,416 మంది, బైపిసికి 1256మంది పరీక్ష రాశారని తెలిపారు. టాప్‌టెన్‌లో రాణించిన ఎంపిసి, బైపిసి విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అమ్ములు, ఎన్నార్ఐ అకాడమీ సిఇఓ రమేష్‌బాబు, డీన్ సురేష్‌బాబు, ప్రిన్సిపల్ లక్ష్మి, కళ్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పంచాయితీ కార్యదర్శుల పాలకమండలి

నెల్లూరుజిల్లా పంచాయితీ కార్యదర్శుల సంఘం పాలక మండలి ఏర్పాటుకు రాష్ట్ర సంఘం ఆదివారం నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించింది. జిల్లా గౌరవాధ్యక్షుడిగా జి.శ్రీరాములు, అధ్యక్ష కార్యదర్శులుగా జి.శ్రీధర్‌చౌదరి, ఎస్.అశోక్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కోశాధికారిగా వి.మల్లిఖార్జున రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.గంగయ్య, ఉపాధ్యక్షులుగా ఆర్.శివకుమార్, బుజ్జమ్మ, షేక్ ముషీదర్, వై.రమేష్‌బాబులను ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక కార్యదర్శిగా వి.రామ్మోహన్, డివిజన్ కార్యదర్శిగా దుర్గా దొరబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.డి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటాద్రి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# దేశభక్తిని బాల్యం నుండే పెంపొందించాలి

ఇటీవల మన దేశంలో 'భారత్ మాతాకీ జై' అంటేనే దేశభక్తి ఉన్నట్లుగా భావించి, అనేకమంది ప్రకటనలు చేస్తున్నారు. ఆవేశంతో ఊగిపోతున్నారు. భారతదేశంలో పుట్టిన ప్రతి పౌరుడు భారతీయుడే! వారిలో దేశభక్తి, జాతీయతా భావం పెంపొందించబడాలి. 'దేశభక్తి' అనేది ఒక మానసికమైన భావన. 'ఇది నా దేశం' అనే ప్రేమ, భక్తి ప్రతి పౌరుడిలో ఉండాలి. పైకి భౌతికంగా 'జై భారత్ మాతా' అని చెప్పి, దేశానికి ద్రోహం చేస్తున్న ఎందరో ప్రబుద్ధులను చూస్తున్నాం. అలా భౌతికంగా చెప్పాలనడం సరైనదిగాదు. వారిలో మానసిక భావం పెంపొందించాలి. బాల్యం నుండి తల్లిదండ్రులు, విద్యాసంస్థలు భావిభారతపౌరులలో దేశభక్తిని పెంపొందించే చర్యలు చేపట్టాలి. అందుకు తగిన కృత్యాలు చేపట్టాలి. ఉదాహరణకు మన దేశానికి, మరో దేశానికి క్రికెట్ జరుగుతుంటే, మనమే గెలవాలనుకోవడం గెలిస్తే సంబరాలు చేసుకోవడం, ఓడితే మనోవేదన చెందడం చూస్తున్నాం గదా! అలాగే యుద్ధ సమయంలో మన పౌరులలో ఐక్యతాభావం చూసాంగదా! అది 'మనము – మన దేశం' అనే భావన కల్గినపుడే సాధ్యం. ఒకరు చెపితే కాదు. ప్రభుత్వం బాల్యం నుండి దేశభక్తి పెంపొందించే కార్యక్రమాలు పాఠశాలల్లో ప్రవేశపెట్టడం మంచిది. అంతేగాని ఊరికే నినాదాలు చేసినంత మాత్రాన ఏమీ ఒరగదు. దీనిపై మేధావులు ఆలోచించి మాట్లాడాలి!

ఎం.శ్రీనివాసరావు, నెల్లూరు.

## పట్టాభిరామయ్యకు నివాళి

శ్రీ అయ్యప్పస్వామి భక్తులు, శ్రీ తుమ్మగుంట అయ్యప్పస్వామి క్షేత్రం గురించి తన రచనల ద్వారా ప్రాచుర్యం కల్పించిన మేధావి భట్టారం పట్టాభిరామయ్య గారి మృతి వార్త 'లాయర్' ద్వారా తెలుసుకున్నాను. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. ఆయన నేత్రదాత కావడం మహోన్నతం. ఆయన ఆశయాల మేరకు తుమ్మగుంట క్షేత్రాన్ని అభివృద్ధి చేయడానికి దేవాదాయశాఖ ముందుకు రావాలి.

– ప్రొఫెసర్ కె.ఎస్.రావు, కావలి.




## రఫ్‌టైల్స్ వేయాలి

బాత్‌రూములో రఫ్‌టైల్స్ వేస్తే 60ఏళ్ళ దాటిన పెద్దలు జారిపడకుండా ఉంటారు. అలాగే వాళ్ళు బాత్‌రూం గడి పెట్టకుండా స్నానం చేసే విధంగా కుటుంబసభ్యులు చొరవ చూపాలి. ఎందుకంటే ఈ మధ్య ఎక్కువ ప్రమాదాలు బాత్‌రూమ్‌లలోనే జరుగుతున్నాయి. మన పెద్దలను కాపాడుకోవడానికి చర్యలు తీసుకుందాం.

వీరిశెట్టి మౌనిక, మెడికో, నెల్లూరు.

## వాళ్లే హీరోలు

కాశ్మీర్‌లోని 'నిట్' కళాశాలలో భారతీయ జెండాను ఎగురవేసిన స్థానికేతర విద్యార్థులే నిజమైన హీరోలు. వెస్టిండీస్ చేతిలో భారత్ ఓడిపోతే సంబరాలు జరుపుకున్న స్థానిక విద్యార్థులు దేశద్రోహులే! వెస్టిండీస్ ప్రభుత్వమేమన్నా వీళ్లను చదివిస్తుందేమో! దేశభక్తితో దేశ ద్రోహులతో తలపడ్డ నిట్ స్థానికేతర విద్యార్థులను చూసన్నా కన్నయ్య కుమార్ లాంటి విద్రోహులు బుద్ధి తెచ్చుకోవాలి.

– వి.సతీష్, హైదరాబాద్.

## ట్రాఫిక్ ప్రైవేట్ పరం

ప్రభుత్వ వ్యవస్థ మన దేశంలో కుప్పకూలింది. రాజకీయాలు మంట కలిసాయి. ప్రైవేట్ యాజమాన్యాలే చక్కగా పని చేస్తున్నాయి. నెల్లూరులో ట్రాఫిక్ కంట్రోల్‌ను కూడా ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలకు అప్పగించడం మేలనిపిస్తోంది. నెల్లూరులో ట్రంకురోడ్డును పరిశీలిస్తే ఇసుకేస్తే రాలనంత జనం. సైకిల్ నుండి లారీల వరకు నెల్లూరు ట్రాఫిక్ గందరగోళంగా వుంటుంది. నెల్లూరు ట్రాఫిక్ బాగుపడాలంటే ప్రైవేట్ యాజమాన్యమే కరెక్ట్.

– వాస్తు రామచంద్ర, నెల్లూరు.





# ఈ వేడుక... ఎవరికి కానుక

*ప్రతి ఏటా ఉగాది వేడుకలను అధికార యంత్రాంగం కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహిస్తుంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు అచ్చతెలుగు వస్త్రధారణతో వచ్చి అలరిస్తుంటారు. అలాగే తెలుగు పంచాంగం, తెలుగు ఉపన్యాసాలు, తెలుగు కవితలు విని తరిస్తుంటారు. ఆ తర్వాత తెలుగు కవులకు సన్మాన సత్కారాలు ఎలాగూ ఉండేవే! ఈ ఏడాది కూడా ఉగాది వేడుకలను ఉదయం పూట కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించారు. కొంత కళ తగ్గినా ఫర్వాలేదనుకోవచ్చు.*

కాని ఎప్పుడూ లేనివిధంగా అదేరోజు రాత్రి ఉగాది వేడుకల పేరుతో ఏ.సి స్టేడియంలో స్టేజీషో ఏర్పాటు చేశారు. ఇది ఎవరి మెహర్బానీ కోసం చేసారో, ఎవరికి లబ్ది చేకూర్చాలని చేసారో ఆ భగవంతుడికే తెలియాలి. టీవీ ఛానల్స్ వాళ్ళ 'పాడుతా తీయగా', 'స్వరఝురి' వంటి కార్యక్రమాలకు ఏర్పాటు చేసినంత భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. అయితే అందుకు తగ్గట్టుగా కార్యక్రమాలే లేవు. ఆరోజు రాత్రి నిర్వహించిన కార్యక్రమాలకు అంత బిల్డప్ అవసరం లేదు. యాంకర్‌గా పని చేసిన అమ్మాయి నోరు తెరిస్తే ఇంగ్లీష్, తెలుగు పదాలను మిక్సీలో వేసి కలిపినట్లు మాట్లాడింది. ఇదొక తెలుగు కార్యక్రమంలా కాకుండా టీవీ ఛానెల్స్‌లో వచ్చే స్టేజీ ప్రోగ్రామ్‌లా అనిపించింది.

పోనీ ఇన్ని లక్షలు ఖర్చుపెట్టి ఒక ఈవెంట్ కంపెనీ ద్వారా కార్యక్రమం చేస్తున్నారు కాబట్టి ఆ స్థాయిలో ప్రచారం చేసి ప్రేక్షకులను రప్పించారా అంటే అదీ లేదు. ఈ కార్యక్రమంకు వచ్చిన జనం అంతంత మాత్రం. వ్యాఖ్యాతలు అడిగి అడిగి మరీ చప్పట్లు కొట్టించుకునే రీతిలో కార్యక్రమాలు సాగాయి. ఇంత భారీగా కార్యక్రమం చేస్తుంటే నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు తప్పితే ఇంకెవరూ ప్రజాప్రతినిధులు లేరు. అధికార పార్టీ నుండైతే ఒక్క ప్రజాప్రతినిధి కూడా రాలేదు. నెల్లూరులో ఇద్దరు ఎమ్మెల్యేలుంటే ఒక్కరు కూడా హాజరు కాలేదు. దీనిని బట్టి కార్యక్రమ నిర్వహణ ఎంత అధ్వాన్నంగా వుందో అర్ధమౌతుంది.

కార్యక్రమం మొత్తానికి కొంతలో కొంత బాగుందనిపించింది ఫుడ్ స్టాల్స్. పిల్లల ఆటల పరికరాలు. నగరంలోని వివిధ హోటల్స్, బేకరీలు, పండ్ల రసాల వాళ్ళు తమ కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. వచ్చిన వాళ్ళు అవి తింటూ ఆనందంగా గడిపారు. అలాగే పిల్లల కోసం కొన్ని రకాల ఆట పరికరాలు ఏర్పాటు చేసి ఉండడంతో పిల్లలంతా అక్కడ చేరి సరదాగా ఆడుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే జనం ఉగాది వేడుకలు నిర్వహించిన వేదిక దగ్గరకంటే ఫుడ్ స్టాల్స్, ఆట పరికరాల వద్దే ఎక్కువుగా కనిపించారు.

ఉగాది వేడుకల పేరుతో టీవీ ఛానెల్స్‌లో మాదిరిగా ఇలాంటి స్టేజీ షోలు నిర్వహించే బదులు తెలుగు ప్రాశస్త్యాన్ని, తెలుగు సాహిత్యాన్ని, తెలుగు సంస్కృతి వైభవాన్ని, తెలుగు భాష గొప్పతనాన్ని చాటే పాటలను, పద్యాలను ఎంపిక చేసి ఒక కచేరి మాదిరిగా ఏర్పాటు చేసివుంటే ఎంతో బాగుండేది.

# మన ఊరు - మన పోలీసు

## • చంద్రశేఖర పురాన్ని దత్తత తీసుకున్న ఎస్పీ



రాష్ట్రంలోనే తొలిసారిగా మన ఊరు - మన పోలీసు కార్యక్రమానికి నెల్లూరు జిల్లా ఎస్పీ విశాల్‌గున్ని శ్రీకారం చుట్టారు. జిల్లాలోని ప్రతి గ్రామాన్ని పోలీసు శాఖ దత్తత తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ కొడవలూరు మండలం చంద్రశేఖర పురాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. శాంతిభద్రతలను అదుపు చేసేందుకు నగరంలో చేపట్టిన డయల్ యువర్ లీడర్, ఫేస్‌బుక్, వాట్సప్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో గ్రామస్థాయి నుంచి సమస్యల పరిష్కారానికి తమ వంతు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మన ఊరు - మన పోలీసు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పోలీసులను గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. కానిస్టేబుల్ నుండి డిఎస్పీ వరకు గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రతి నెలా ఎస్సై, సిఐ, డిఎస్పీలు రెండు గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. రెవెన్యూ అధికారుల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిసిఆర్‌బి డిఎస్పీ సీతారామయ్య పాల్గొన్నారు.

# విశ్రాంత పోలీసు అధికారులకు సన్మానం

నెల్లూరుజిల్లాలోని విశ్రాంత పోలీసు అధికారులలో 75ఏళ్లు నిండిన వారిని ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం సన్మానించారు. అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ పోలీసు ఆఫీసర్స్ ఆధ్వర్యంలో మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్షుడు లక్కాకుల ప్రభాకర్‌రావు, ఎన్.సత్యనారాయణ, కోశాధికారి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కె.శ్రీహరిరావు, కె.వీరారెడ్డి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# చదువుకు పేదరికం అడ్డుకాదు

**- డా॥ కె.నరశింహారెడ్డి**



చదువుకు పేదరికం అడ్డుకాదని ప్రఖ్యాత వ్యక్తి వికాస అధ్యాపకుడు డాక్టర్ కె.నరశింహారెడ్డి అన్నారు. ఈ నెల 8వ తేదీన నెల్లూరు కొండాయపాలెంరోడ్డులోని వాత్సల్య భారతీయ విద్యావికాస్ పాఠశాలలో ఉగాది సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రఖ్యాత గణితశాస్త్రవేత్త రామానుజన్, భారతరత్న అబ్దుల్ కలాం, రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్ పేదరికం నుండే ఉన్నతస్థాయికి చేరుకున్నారన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు వెళ్ళాలన్నారు. విద్యార్థులకు మీనాక్షి పవర్‌ప్లాంటు ఉద్యోగులు రూ. 75వేలు విలువగల నోటు పుస్తకాలను అందజేశారు. దాతలను సంస్థ అధ్యక్షుడు రామదండు అభినందించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులను తెలుగు సంవత్సరాది సందర్భంగా విద్యార్థులు సత్కరించి ఆశీస్సులు పొందారు. అనంతరం విద్యార్థినీవిద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాన్ని స్కూలు కరస్పాండెంట్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.వి.సాంబశివరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి ఛైర్మెన్ డా॥ రమేష్‌బాబు, వాత్సల్య జాయింట్ సెక్రటరి టివి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపిలోకి జంప్ చేసిన వైకాపా కార్పొరేటర్లు

నెల్లూరు 51వ డివిజన్ కార్పొరేటర్ ప్రశాంతి కుమార్, 35వ డివిజన్ వైకాపా కార్పొరేటర్ ప్రశాంతి కిరణ్‌లు 8వతేదీ విజయవాడలో నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. సిఎం చంద్రబాబు వారిద్దరికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో నెల్లూరు నగరపాలక సంస్థలో తెదేపా కార్పొరేటర్ల సంఖ్య 34కి చేరింది.



శ్రీ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
అధినేత: సిపిఆర్ కల్యాణ మండపం, శివప్రియ లాడ్జి

ద్వితీయ వర్ధంతి

నిరంతర శ్రామికుడిగా మా అభివృద్ధిని కాంక్షించి
మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి
మంచికి, మానవత్వానికి, దాతృత్వానికి
మారుపేరుగా నిలచిన మా ఇంటి దైవం
కీ॥శే॥ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
పరమపదించి 18.04.2016 నాటికి
రెండేళ్ళు గడుస్తోంది.
వారి దివ్యస్మృతికి మా నివాళులు.

భార్య:
సుబ్బరత్నమ్మ
కుమారుడు - కోడలు:
చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి
మనుమలు:
హరీశ్వర్‌రెడ్డి, భవనేశ్వర్‌రెడ్డి
బంధుమిత్రులు



ఒకే ఒక్కడు...
'సేవ' అనే పదానికే ప్రతీకగా నిలిచి..
సమాజ సేవకే పతాకగా నిలిచి..
గుండెల నిండా మెండైన మానవీయత
మూర్తీభవించిన..మహా మనీషి!

ఒకే ఒక్కడు...
సమాజ సేవారంగంలో మకుటాయమానమై నిలిచి..
సమాజానికి ప్రాణప్రదమైన విద్య-వైద్యం తదితర రంగాల్లో
బృహత్తరమైన..బహుముఖమైన సేవలందిస్తోన్న
మహోన్నత సేవామూర్తి!..

ఒకే ఒక్కడు...
తానొక్కడే అయినా..వేలాదిమంది పేదలకు తోడు-నీడగా నిలిచి..
మానవతా హృదయంతో వారికి అపారమైన సేవలందిస్తూ
వారి జీవితాలకు వెలుగు బాటలు పరుస్తున్న మహనీయమూర్తి!...

ఒకే ఒక్కడు...
పేదలకు..దీనులకు ..చివరికి కాళ్లు సైతం కదల్చలేని వైకల్యంతో
బతుకే ఒక వేదనగా బాధపడుతున్న అసహాయులెందరికో
'ఇదిగో..నేనున్నా' నంటూ ఆదరహస్తం అందించే అమృతమూర్తి!
ఆయనెవరో కాదు..
'సేవా ప్రభాకరుడు'..నిరంతర సేవా పథికుడు..
పేదల బాధలు తెలిసిన సహృదయుడు..మహా దాత..
దీనజనులకు హృదయపూర్వకమైన సేవలందించే ఆత్మీయమూర్తి!
ఆయనెవరో కాదు..
అతడే **వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి..**
సేవకు ఆయనో చిరునామా!..
మానవత్వమే ఆయన జెండా..సేవాభావమే ఆయన అజెండా!...

ఒకే ఒక్కడు...
సమాజానికి అటు సేవాపరంగా, ఇటు ఆధ్యాత్మికంగానూ కూడా
ఎన్నోవిధాలైన..సేవలందించడం
సమాజ సేవా రంగంలోనే అపూర్వం..అమోఘం!
నిరుపేద పిల్లలకు పుస్తకాలు కావాలన్నా
వైకల్యంతో వున్నవారికి ఆసరాగా ఏ సాయం కావాలన్నా
బడులు.. గుడులకు ఏ నిర్మాణాలు కావాలన్నా
ఇలా ఎక్కడ ఏది అవసరం వచ్చినా
అందరికీ ఆయనే గుర్తొస్తాడు
వేలాదిమందికైనా సరే కాదనకుండా.. లేదనకుండా
అన్నం పెట్టే మహాదాత ఆయన!...
కోట్లాది రూపాయలను సైతం చిరునవ్వుతోనే వితరణగా అందించే
మహా దాత..దాతలకు దాత..వరదాత ఆయన.
ఆయన సింహపురిసీమకే వెలుగుల కిరణం
నెల్లూరుసీమకే ఆయన సేవలు..గర్వకారణం!...

ఒకే ఒక్క వ్యక్తి..సమాజసేవ కోసం ఒక శక్తిగా..సమాజ సేవా సామ్రాజ్యంలోనే ఒక అమేయమైన సైనికశక్తిగా మారి తన సేవాదీప్తులను అన్ని రంగాల్లో అనంతంగా విస్తరించుకుంటూ పోవడమంటే.. అది అందరికీ సాధ్యమయ్యే పని కాదు. అందుకు తగ్గ ఆర్థికశక్తి పుష్కలంగా వుండాలి. అంతేకాదు, ఆ ధనాన్ని నిండుమనసుతో పేదలకు, ధర్మకార్యాలకు, సమాజసేవకు అర్పించగలిగే ఔదార్యమూ వుండాలి. అంతకుమించి మానవతా హృదయంతో వితరణ చేయగలిగే అపారమైన దాతృత్వగుణం కలిగివుండాలి. అటు ధనం, ఇటు వితరణ గుణం రెండూ కలగలసి పుట్టిన వేమిరెడ్డికే అది సాధ్యమని అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే, వేమిరెడ్డి అంటేనే.. సేవకో చిరునామా. దయగల హృదయమే భగవన్నిలయం.. అన్నట్లుగా ఎందరో ఆర్తులకు, అన్నార్తుల సేవలకు లక్షలాది ధనాన్ని కేటాయించే దానగుణం ఆయన సొంతం. సమాజానికి నిరంతరం తనవంతు చేయూతనందించే మహోన్నత సేవాగుణం వున్న వేమిరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలకు లెక్కే లేదు. ఆయన చేస్తున్న సమాజసేవల జాబితాలో ఎన్ని చెప్పినా..ఎంతగా వివరించినా ఇంకా చెప్పాల్సినవి ఎన్నో వుంటాయి. ఆకాశమే హద్దుగా.. ఆయన చేస్తున్న సేవలు అనంతమైనవి.. అమూల్యమైనవి.. అపూర్వమైనవి.. అమోఘమైనవి కూడా.







# సేవా సామ్రాజ్యంలో...

# అతడే ఒక సైన్యం

## మూర్తీభవించిన మానవత్వానికి.. షష్ట్యబ్ది పూర్తి

### పేద విద్యార్థులకు ఆలంబనగా..
### 'విపిఆర్ విద్య' :

తొలినుంచి విపిఆర్ (వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి)కి పేదవిద్యార్థుల చదువుల పట్ల ఎంతో ఆసక్తి. చదువుతోనే సమాజంలో మంచి గౌరవం, ఉన్నత స్థాయి లభిస్తాయని, ప్రతి విద్యార్థి కష్టపడి బాగా చదువుకున్ననాడే వారికి మంచి జీవితం లభిస్తుందని ఆయన గట్టిగా విశ్వసించేవారు. అయితే, ప్రతిభా పాటవాలు వున్నప్పటికీ అందుకు తగ్గ ఆర్థికస్తోమతు లేక పేదరికంతో బాధపడుతూ, ఉన్నత చదువులు చదువుకోలేని దీనావస్తలో వున్న ఎందరో విద్యార్థులకు అత్యున్నత విద్యాబోధన చేసే ఒక అద్భుతమైన విద్యాసంస్థ నెలకొల్పాలని ఆయన నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా కనుపర్తిపాడు గ్రామం సమీపంలో ఆ మేరకు ఒక అందమైన..అధునాతనమైన భవనాల సముదాయాన్ని నిర్మించి, కేజీ నుంచి పీజీ వరకు విద్యకు ఎలాంటి కొరత లేకుండా ఆ ప్రాంతాన్నంతా చదువుల తల్లి కోవెలగా రూపొందిస్తున్నారు. ఈ విద్యా సేవలన్నిటికీ కలిపి 'విపిఆర్ విద్య'గా నామకరణం చేశారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, సమాజాన్ని విద్యాకాంతులతో దేదీప్యమానం చేయాలన్నదే ఆయన స్వప్నం. ఆ కల సాకారం కావాలన్నదే ఆయన ఆశయం. అందుకోసం అనుక్షణం విరామమెరుగని కృషి చేస్తున్నారాయన. విపిఆర్ ట్రస్ట్ తరపున నిర్వహించనున్న ఈ అత్యున్నతమైన విపిఆర్ విద్యాసంస్థలో అన్ని రకాలైన సదుపాయాలు ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచితంగానే అందుతాయి. ఆ విద్యార్థుల జీవితాలకు ఉపయోగపడే విద్యనందించేందుకు అవసరమైన వృత్తి విద్యాకోర్సులను, అధునాతనమైన..సాంకేతికపరమైన..దేశంలోనే అత్యుత్తమమైన ఎన్నో రకాల కోర్సులను కూడా అందించాలని, భవిష్యత్‌లో 'విపిఆర్-విద్య' సంస్థను ఒక డీమ్డ్ యూనివర్శిటీగా కూడా రూపొందించి విద్యార్థిలోకానికి శాశ్వతమైన రీతిలో ఈ సంస్థను ఆ చదువుల తల్లికి నిలయంగా..సరస్వతీదేవి ఆలయంగా తీర్చిదిద్దాలని వేమిరెడ్డి చేస్తున్న కృషి అనితర సాధ్యమైనది. చదువు పట్ల బాగా ఆసక్తి వుండి, చదువే జీవిత లక్ష్యంగా వున్న విద్యార్థులకు, 'విపిఆర్ విద్య'..ఒక దేవాలయం లాంటిది. అంతేకాదు, రాష్ట్రంలోనే మరెక్కడా లేనివిధంగా..పేదవిద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగానే అందించేందుకు ఆ మహోన్నత విద్యా దాత చేస్తున్న కృషి అమోఘం..!

### చిన్నారిలోకానికి..ఎన్నో వరాలు :

చిన్నారులంటే ఎనలేని ప్రేమాభిమానాలున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చిన్నారి లోకానికే ఒక వరం. నిరుపేదలు, పుట్టుకతోనే వైకల్యం ప్రాప్తించి కదలలేక..మెదలలేక వేదనతోనే జీవిస్తున్న ఎందరో అసహాయులకు వేమిరెడ్డి సేవలే ఊరట. నెల్లూరులో అనాథబాలికలను అక్కున చేర్చుకుని వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తున్న 'వాత్సల్య' సేవా సంస్థకు ఆయన కొండంత అండగా నిలిచి ఆ చిన్నారుల అభ్యున్నతి కోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఆ సంస్థకు అవసరమైన భవన నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు విరాళం అందించడమే కాక, ప్రతి ఏడాది ఆగస్టు నెలలో ఆ సంస్థలోని చిన్నారులందరి భోజనాలకీ వ్యయమయ్యే నాలుగున్నర లక్షల రూపాయలను కూడా ఆ సంస్థకు అందజేసి చిన్నారుల సేవ పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలనే సదాశయంతో ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఇన్‌డోర్ స్టేడియం నిర్మాణానికి అక్షరాలా పది లక్షల రూపాయలను విరాళంగా అందించిన మహా దానశీలి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. గతంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యలో, ప్రతిభావంతులైన పేద విద్యార్థుల కోసం రూపొందించిన 'సరస్వతి నిధి'కి ఆయన నాలుగు లక్షల రూపాయల విరాళం అందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహాన్నిస్తూ స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అక్షర పాఠశాల'కు వేమిరెడ్డి విరాళం..అయిదు లక్షల రూపాయలు. ఈ మొత్తంతో ఆ పాఠశాల విద్యార్థులకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు ఇచ్చే ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్‌కిట్స్ పంపిణీకే ఆయన లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. చిన్నారుల అభ్యున్నతికి, వారి విద్యకు, వైద్యానికి ఇలా వారికి ఏ అవసరం వచ్చినా ముందుగా అందరి మనసుల్లో మెదిలేది వేమిరెడ్డి పేరే. అందుకే ఆయన బాలల పెన్నిధిగా.. చిన్నారుల హృదయాల్లో మరెవరూ సాధించలేనంతటి సమున్నతమైన స్థానం సంపాదించుకున్నారంటే..అది ఆయన మానవీయ హృదయానికీ, అపారమైన సేవాభావానికీ.. అంతేలేని వితరణ గుణానికీ ఒక ప్రతీక అని చెప్పవచ్చు.

### పేదలకు ఉచిత వైద్యసేవల కోసం..
### విపిఆర్ వైద్యం :

రకరకాల ప్రాణాంతక వ్యాధులతో సతమతమవుతున్న పేదరోగులకు చేయూతగా, వారి వైద్యచికిత్సల కోసం లక్షలాది రూపాయలను కేటాయిస్తూ.. ప్రాణభీతితో తల్లడిల్లే వారిని ఊరడిస్తూ.. వారి జీవితాల్లో కొత్తవెలుగులు ప్రసరింపజేస్తున్నారు. వైద్యరంగంలోనూ ఎనలేని దాతృత్వంతో అపారమైన తన సేవలను ఆపన్నులను ఆదుకునేందుకు విస్తరిస్తున్నారు. గతంలో, గుండె వ్యాధులతో బాధపడే సుమారు 150 మంది చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి వారికి పునర్జన్మనిచ్చేందుకు సంకల్పించిన చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌కు కూడా వేమిరెడ్డి తన విరాళంగా లక్ష రూపాయల విరాళం అందజేశారు. 'విపిఆర్ వైద్యం' పేరుతో ఆ సేవలను మరింతగా విస్తరింపజేస్తూ వ్యాధులతో కొట్టుమిట్టాడుతున్న ఎంతోమంది అభాగ్యులను ఆదుకోవడానికి సంసిద్ధమౌతున్నారు. అంగవైకల్యంతో బాధపడేవారికి తానున్నానంటూ చేయూతనందిస్తూ వారికి అవసరమైన చికిత్సలను, కృత్రిమ అవయవాలను సమకూర్చిపెట్టేందుకు వీలుగా స్వర్ణభారత్ ట్రస్ట్‌కు 5 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. వైకల్యం ఒక శాపంగా నిత్యం ఆవేదనతోనే జీవించేవారికి కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారు. నిరుపేదల ఆరోగ్యం కోసం, ప్రజల సంక్షేమం కోసం కనీవినీ ఎరుగని రీతిలో ఒక అత్యద్భుతమైన ఆసుపత్రి నిర్మాణానికి ఆయన సంకల్పించడం సింహపురి సీమ అదృష్టమనే చెప్పాలి. ఈ వైద్యాలయంలో పేదలకు అవసరమైన అన్నిరకాల అత్యుత్తమమైన వైద్యసేవలు ఉచితంగానే లభించేవిధంగా ప్రణాళిక రూపొందించారు. మంచి ఆరోగ్యమే ప్రజలకు శ్రీరామరక్ష కనుక..పరిశుభ్రమైన వాతావరణాన్ని, ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తూ అందుకు అనుగుణమైన అన్ని ఏర్పాట్లనూ పటిష్టవంతంగా నిర్వహించే నిరంతర కృషిలో ఆయన నిమగ్నమైవున్నారు. తద్వారా ఒక పరిశుద్ధమైన సమాజానికి ఆయన సరికొత్త బాటలు వేస్తున్నారు. ఈ ఆసుపత్రిని భవిష్యత్తులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దే లక్ష్యానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

### కళలకు వెలుగునిచ్చే..
### విపిఆర్ కళాపీఠం :

వేమిరెడ్డి అంటేనే..ఆధ్యాత్మికత్వానికి, కళలకు వెలుగుబాటలు పరిచే మహనీయవ్యక్తి అని అందరికీ తెలిసిందే. ఇటీవలే నెల్లూరులో ఆయన నిర్వహించిన శ్రీవారి వైభవోత్సవాలు అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. తిరుమలలోని శ్రీవారి ఆలయంలో సైతం మనం దర్శించలేని ఎన్నో మహత్తరమైన శ్రీవారి సేవలను కూడా మన కళ్ళకు కట్టేవిధంగా తిరుమల ఆలయ అర్చకులతో దర్శింపజేసిన పుణ్యమూర్తి..వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. వేలాదిగా..లక్షలాదిగా శ్రీవారి భక్తులు నెల్లూరులో అత్యద్భుతంగా..న భూతో న భవిష్యత్ అనే రీతిలో జరిగిన 'శ్రీవారి వైభవోత్సవాలను' ఆద్యంతం ఆసాంతం తిలకించి పరవశించి పోయారంటే..అదంతా వేమిరెడ్డి ఆధ్యాత్మిక సేవా తత్పరతేనన్నది జగద్విదితం. మానవ సేవకు..మాధవసేవకు ప్రతీకగా, అటు సమాజసేవ ఇటు భగవత్సేవలో తరించే ధన్యజీవి ఆయన. ఎన్నో ఆలయాలకు, భగవత్‌కైంకర్యాలకు ఆయన చేసిన సేవలు అపూర్వం. శ్రీకాళహస్తిలో ఆ పరమేశ్వరుని సన్నిధిలో జరుగుతున్న రాహుకేతు పూజలను నెల్లూరీయులకు కూడా అందుబాటులో వుండేవిధంగా, మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరాలయంలో దాదాపు 30 లక్షల రూపాయలకు పైగానే వెచ్చించి ఆ విశిష్టమైన పూజలు ఇక్కడ కూడా జరిగేలా ఏర్పాటు చేసి నెల్లూరీయుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. అంతేకాదు, కర్నూలు జిల్లాలోని మహానంది పుణ్యక్షేత్రం అభివృద్ధికి కూడా ఆయన దాదాపు 7 లక్షల రూపాయలు విరాళం అందజేసి తన భగవద్భక్తిని చాటుకున్నారు. నెల్లూరులోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో ప్రతిఏటా నేత్రపర్వంగా జరిగే 'జగన్నాథ రథయాత్ర'కు, వేలాదిగా తరలివచ్చే భక్తజనసందోహానికి కూడా ఆయన తనవంతుగా నిరుపమానమైన సేవలందిస్తున్నారు. ఆకాశమే హద్దుగా తన దానగుణంతో..ఔరా అని అందరికీ ఆశ్చర్యమనిపించే ఔదార్యంతో ఆయన ఎన్నో ఆధ్యాత్మిక సేవలతో తరిస్తూనే వున్నారు. ఈ నేపథ్యంలో 'విపిఆర్ కళాపీఠం' స్థాపనకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎంతో మహోన్నతమైన భారతీయ సంప్రదాయాలు- సంస్కృతినీ పరిరక్షిస్తూ, మన భారతీయ కళలను సమాదరిస్తూ..వాటిని మరింతగా ప్రోత్సహిస్తూ...ఈ మహత్తరమైన బృహత్తరమైన సంప్రదాయ వారసత్వాన్ని పదికాలాలపాటు పరిరక్షించుకునేవిధంగా, భావితరాలకూ మన భారతీయ సంప్రదాయాలు వెలుగుబాటలు పరిచే విధంగా.. సమున్నతమైన ఆశయంతో రూపొందుతున్నదే..'విపిఆర్ కళాపీఠం'. ఈ సందర్భంగా ప్రజా జీవితంలో విశేషమైన..విశిష్టమైన..మహత్తరమైన సేవలందించే మహనీయునికి ప్రతి ఏటా ఒక ప్రతిష్టాత్మకమైన సత్కారంతో 'విపిఆర్ అవార్డు'ను కూడా అందజేసే బృహత్తరమైన ఆలోచనతో వున్నారు.

### వృద్ధులకు బాసటగా..
### 'విపిఆర్ వాత్సల్యం' :

విధివశాత్తూ జీవనాధారమూ..జీవితాధారమూ కోల్పోయి..వృద్ధాప్యంలో వేదనలకు గురవుతున్న వృద్ధుల జీవితాలకు బాసటగా వుండేందుకు..పెద్దల పట్ల వున్న అవ్యాజమైన ప్రేమానురాగాలతో..ఆత్మీయమైన వాత్సల్యంతో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సారథ్యంలో చేపట్టిన మరో సేవాకార్యక్రమం.. .'విపిఆర్ వాత్సల్యం'. వృద్ధాప్యం పైనబడి, ఏ పనీ చేయలేని అసహాయస్థితిలో వున్న ఎంతోమంది వృద్ధులకు ఇది ఒక చేయూతగా నిలుస్తుంది. అందుకోసం వృద్ధులను సమాదరించే వాత్సల్య ఫౌండేషన్‌కు ఆయన లక్షలాది రూపాయలను విరాళంగా అందజేసి, ఆ వృద్ధులందరికీ ఒక నెలరోజులపాటు భోజన సదుపాయాలకయ్యే మొత్తం ఖర్చునంతా తానే భరిస్తున్నారు. ఇలా ఎన్నో రంగాల్లో తన సేవలు విస్తరిస్తూనే వున్నారు. అటు చిన్నారులను, విద్యార్థులను, వికలాంగులను.. వృద్ధులను సైతం ఆదరించి..అసహాయులైన వారందరికీ తనే ఒక సాయంగా వుంటూ వారందరి జీవితాలకు ఆయన సరికొత్త వెలుగుబాటలు పరుస్తున్నారు. ఆ మహనీయ మానవతా మూర్తికి.. మహోన్నత దాతకు.. నిరంతర సేవా దీప్తికి.. అకుంఠిత సేవాస్ఫూర్తికి... ఇవే మా అభివందన శుభచందనాలు. ఆయన షష్ట్యబ్ది పూర్తి జన్మదినం సందర్భంగా నిండు మనసుతో.. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి 'లాయర్'.. శుభాకాంక్షలు.

# నెల్లూరులో రెండ్రోజులు వెంకయ్య పర్యటన



కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు 15, 16తేదీలు రెండ్రోజులు పూర్తిగా నెల్లూరు జిల్లాలోనే ఉండబోతున్నారు. 15వ తేదీ ముంబై నుండి తిరుపతి ఎయిర్‌పోర్టులో దిగి అక్కడ నుండి రోడ్డు మార్గాన ఓజిలి వద్ద గల స్పోర్ట్స్ అకాడమీ వద్దకు చేరుకుంటారు. అక్కడ శివంతి ఆదిత్యన్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌కు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత వెంకటాచలంలో, వింజమూరులలో కమ్యూనిటి హెల్త్ సెంటర్ల శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొంటారు. అదేరోజు రాత్రి నెల్లూరులో కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. 16వ తేదీ ఉదయం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే ఉచిత గుండె వ్యాధుల వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు. 11.30గంటలకు నెల్లూరు, కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే పారిశ్రామికవేత్తల సభనుద్దేశించి ప్రసంగిస్తారు. అదేరోజు సాయంత్రం పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు.

# భక్తి టివి పంచాంగం ఆవిష్కరణ



భక్తి టివి వారు రూపొందించిన దుర్ముఖినామ సంవత్సర పంచాంగాన్ని ఈ నెల 9వ తేదీన నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ప్రముఖ దాత, సేవాతత్పరుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించాడు. తొలుత పంచాంగాన్ని స్వామివారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పంచాంగం అర్చకులకు, పండితులకే కాక సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఉందని చెబుతూ, దీనిని రూపొందించిన భక్తి టివి వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర డిఎస్పీ వెంకటరాముడు, దేవస్థానం ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు పాల్గొన్నారు.

# అలరించిన ఉగాది కవిసమ్మేళనం



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు రంగనాయకులపేటలోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన దుర్ముఖి నామ ఉగాది కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని ఆధ్వర్యంలో, ప్రముఖ కవి-ప్రయోక్త చిన్ని నారాయణరావు సారథ్యంలో ఈ కవిసమ్మేళనం ఆద్యంతం అందరినీ అలరించింది. ప్రముఖ కవులు ఏటూరి నాగేంద్ర, మద్దూరు శ్రీనివాసులు, వంజవాక సతీష్‌రెడ్డి, బొగ్గరపు రాధాకృష్ణ, దగ్గుమాటి ప్రభాకర్, గాలి లలితా ప్రవల్లిక తమ కవితలను భావరసస్ఫోరకంగా పఠించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్‌బాబు, ఎం. విక్రం, కోశాధికారి సత్యనారాయణ పాల్గొని కవులందరినీ ఘనంగా సత్కరించారు. ఈ ఉగాది వేడుకల సందర్భంగా లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన దేవతామూర్తుల వేషధారణలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

## 16న ఎన్నెస్కే స్మారకోపన్యాసం

నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేది సాయంత్రం 6.30 గంటలకు ప్రముఖ చరిత్రకారుడు దివంగత శ్రీ నేలనూతల శ్రీకృష్ణమూర్తి (ఎన్నెస్కే) 13వ స్మారకోపన్యాసం నిర్వహిస్తామని ఆ సమాజం అధ్యక్ష కార్యదర్శులు వంటేరు వెంకట కృష్ణారెడ్డి, మజ్జిగ ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. టౌన్‌హాలు ప్రాంగణంలోని శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్శిటీ రిటైర్డ్ డీన్ ఆచార్య మొదలి నాగభూషణ శర్మ 'తెలుగు నాటక రంగము' అనే అంశంపై ఉపన్యసించి ఎన్నెస్కే స్మారక సమ్మానం స్వీకరిస్తారని, ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, సాహితీ వేత్తలు, సాహిత్యాభిమానులు, ఎన్నెస్కే అభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



**మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా నెల్లూరు ఇందిరాభవన్‌లో పిసిసి సమన్వయ కమిటి సభ్యులు సి.వి.శేషారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్ళపల్లి అరుణమ్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వింజమూరు కాలేషాలను సత్కరించిన జిల్లా కాంగ్రెస్‌పార్టీ బిసి సెల్ కార్యకర్తలు.**



# రాజీమార్గంతో కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న ఏడో జిల్లా అదనపు జడ్జి గురప్ప, ప్రక్కన న్యాయమూర్తులు

రాజీమార్గంతో లోక్అదాలత్ ద్వారా కేసులకు సత్వర పరిష్కారం దొరుకుతుందని ఏడో జిల్లా అదనపు జడ్జి గురప్ప తెలిపారు. గూడూరులోని కోర్టు ప్రాంగణంలో ఈ నెల 9వ తేదీ లోక్అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరు వర్గాల సమ్మతితో చట్టానికి లోబడి కేసులు పరిష్కరించేందుకు లోక్అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనిపై ప్రజలు అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని చెప్పారు. ప్రతి నెల రెండో శనివారం లోక్అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. 12క్రిమినల్, 6 సివిల్, రెండు చెక్‌బౌన్స్, ఒక భరణం, 29 లేబర్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. రూ.19,89,810 బాధితులకు పరిహారం రూపేణా అందినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.పి.సాయిరాం, ఏడుకొండలు, శంకరయ్య, లోక్అదాలత్ సభ్యులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర మహిళా మండలి చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిఎస్పీ సతీమణి ఇందిర, ప్రక్కన డాక్టర్ సి.రోహిణి తదితరులు

గూడూరు మార్కెట్ కూడలి వద్ద ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 8వ తేదీ డిఎస్పీ సతీమణి బాదిపల్లి ఇందిర ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహద పడతాయన్నారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు మాగుంట సుదర్శనమ్మ, కార్యదర్శి ప్రభ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ ఇంటర్నేషనల్‌కు బొమ్మిరెడ్డి

అమెరికాలో జరిగే రోటరీ ఇంటర్నేషనల్ సమావేశానికి రోటరీ ఫాస్ట్ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి ఎంపికయ్యారు. దీంతో ఇటీవల స్థానిక రోటరీ భవన్‌లో సురేంద్రరెడ్డిని రోటరీ క్లబ్ అధ్యక్షుడు అశోక్ చక్రవర్తి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్‌కు సంబంధించి పరిపాలనా విభాగాల్లో తీసుకోవాల్సిన మార్పులకు సంబంధించి ప్రతి మూడేళ్లకొకసారి అమెరికాలో రోటరీ ఇంటర్నేషనల్ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రోటరీ డిస్ట్రిక్ నుంచి బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి హాజరై నివేదికలు అందించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మునిరాజా, దశరథరామిరెడ్డి, కె.మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో గూడురు పట్టణ ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న గూడూరు తహాశీల్దార్ సత్యవతి

# వేసవిలో ప్రజలు అప్రమత్తం

\- సిఐ సుబ్బారావు




ప్రజలు అప్రమత్తంగా ఉంటే వేసవిలో జరిగే చోరీలను నివారించవచ్చని పట్టణ సిఐ సుబ్బారావు తెలిపారు. గూడూరు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులతో కలసి ఆయన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బారావు మాట్లాడుతూ చిన్నచిన్న జాగ్రత్తలతో పెద్ద నేరాలను అదుపు చేయడానికి ప్రజలు సహకరించాలని సూచించారు. అంతరాష్ట్ర చోరీ ముఠా నాగరాజు, సంతోషి షిండే, మనోజ్‌ల బృందం శివారు ప్రాంతాల్లోని ఇళ్ళల్లో ఒంటరిగా ఉన్న మహిళలను గుర్తించి పదునైన ఆయుధంతో ప్రాణాలు తీస్తూ దొరికినకాడికి చోరీలకు పాల్పడుతున్నారని, వారి పట్ల ఎప్పటికప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాలనీల్లో కొత్త వ్యక్తులు కనిపించినా అనుమానాస్పదంగా ఎవరినైనా గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రదానంగా బస్సు, రైల్వేస్టేషన్లు, సినిమాహాళ్ళు, రద్దీ కూడళ్లలో సంచరిస్తుంటారని, వీరిని గుర్తిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని అన్నారు. వేసవి కాలంలో ఇళ్లకు గట్టిగా తాళాలు వేసి విలువైన వస్తువులను ఇంట్లో పెట్టుకోకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు దశరథరామారావు, బాబి, ఐడి పార్టీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# చిరుద్యోగికి సత్కారం



గూడూరు డిఆర్‌డబ్ల్యూ కాలేజీలో 32 సంవత్సరాలుగా అటెండరుగా సేవలందిస్తున్న అన్నపూర్ణమ్మకు ఆమె సేవలను గుర్తించి ఆంధ్ర మహిళా మండలి వారు గూడూరు డిఎస్పీ సతీమణి బాదిపల్లి ఇందిరచే ఇటీవల సిఆర్ మార్టు ఫంక్షన్ హాలులో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.రోహిణి పాల్గొని ప్రసంగించారు. ఇంకా మహిళా మండలి అధ్యక్షులు సుదర్శనమ్మ, కార్యదర్శి ప్రభ, ఎల్లసిరి లక్ష్మి, విష్ణువందన, సభ్యులు పాల్గొన్నారు.

# వృత్తి విద్యలో నైపుణ్యం అవసరం



మహిళకు సామాగ్రినందిస్తున్న క్లబ్ ప్రతినిధులు పొనకా సునందారెడ్డి

మహిళలు వృత్తి విద్యలో నైపుణ్యం సాధించడం ఎంతైనా అవసరమని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు పొనకా సునందారెడ్డి తెలిపారు. పట్టణంలోని రాజావీధిలోని సునీతా సేవా సంస్థ కార్యాలయంలో సోమవారం ఆ క్లబ్ ఆధ్వర్యాన మహిళలకు వాషింగ్‌పౌడర్ తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్హతతో పని లేకుండా మహిళలు వృత్తి విద్యలో మెలకువలు నేర్చుకొని ఇంటి వద్దనే ఉంటూ వివిధ రకాల వస్తు సామాగ్రిని తయారు చేయడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ కార్యదర్శి స్నేహలతా రెడ్డి, సభ్యులు పరమేశ్వరి, జీవని, సారంగం సులక్ష్మి, శశికళ, ప్రభావతి, సుదేష్ణ, సిఎస్‌ఎం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావ్ పూలే ఆశయాలను సాదిద్దాం



మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను సాదిద్దామని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. పూలే 190వ జయంతిని పురస్కరించుకుని సోమవారం నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులో వున్న పూలే దంపతుల విగ్రహాలకు నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్, అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి సంజీవయ్య, బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వి.వరప్రసాద్, నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు.

టిడిపి కార్యాలయంలో పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు జెడ్.శివప్రసాద్, పిఎల్ రావు, వెంకటేశ్వర్లు గౌడ్, రఘురామయ్య, ధర్మవరపు సుబ్బారావు పాల్గొన్నారు. బిటిపి నాయకులు చిట్టేటి రమేష్, ఆదినారాయణ, బిసి నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం, తెలుగు యువత నాయకులు శింగంశెట్టి రవిచంద్ర, మురళీమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. బ్యాంకు ఋణాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి. అయితే ధనానికి ఇబ్బందులుండవు. వృత్తి వ్యాపారములందు అభివృద్ధి ఆదాయం పెరగడం ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత కలదు. చెల్లింపులు సకాలంలో జరుపుతారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభకార్యాల ప్రయత్నాలు అనుకూలించే అవకాశమున్నది. ఉన్నత చదువులకు అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగులకు ప్రజలతో, అధికారులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. వ్యాపకాలు పెరగడం వల్ల, అనుకున్న పనులు సరిగా చేయలేక టెన్షన్ పడుతుంటారు. వృత్తి వ్యాపార వర్గాలకు ఆదాయం సామాన్యంగా ఉంటుంది. అభివృద్ధి రేటు తగ్గుతుంది. ఇతరులకు సహాయపడతారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగులకు, వ్యాపార వర్గాలకు అధికారుల వల్ల ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆదాయం తగ్గవచ్చును. అనుకున్న పనులు, చేపట్టిన వ్యవహారాలను సక్రమరీతిలో నిర్వహించలేక పోవచ్చును. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం జరుగుతుంది. ఉన్నత విద్యావకాశాలు కలవు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 15.4.2016 నుండి
తేది. 21.4.2016 వరకు

ఈ వారము మేషంలో రవిబుధులు, సింహంలో గురు రాహువులు, కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, వృశ్చికంలో శనికుజులు, కుంభంలో కేతువు, మీనంలో శుక్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 15 శుక్రవారము శ్రీరామ నవమి

### ముహూర్తములు :

తేది 21 గురువారం ఉ॥ గంట 9.10 నుండి గంట 11.20లోగా వివాహ వ్యాపార గృహారంభములు మిధునలగ్నము. రాత్రి గంట 9.52 నుండి గంట 12.0లోగా ధనుర్లగ్నమున వివాహ గృహప్రవేశములు. తేది 22 శుక్రవారం ఉ॥ గంట 9.06 నుండి గంట 10.30లోగా మిధున లగ్నమున వ్యాపార గృహారంభ వివాహములు.

### చైత్రమాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | నవమి | రా॥ గం.1.50వ॥ |
| తేది. 16 | శని | దశమి | రా॥ గం.2.02వ॥ |
| తేది. 17 | ఆది | ఏకాదశి | రా॥ గం.2.38వ॥ |
| తేది. 18 | సోమ | ద్వాదశి | రా॥ గం.3.49వ॥ |
| తేది. 19 | మంగళ | త్రయోదశి | రా॥ గం.5.22వ॥ |
| తేది. 20 | బుధ | చతుర్దశి | పూర్తిగ |
| తేది. 21 | గురు | చతుర్దశి | ఉ॥ గం.7.20వ॥ |

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

శుభకార్యాలలో పాల్గొంటారు. దైవక్షేత్రాల సందర్శన, ప్రముఖులను కలుసుకొనడం జరుగుతుంది. ఖర్చులు అదనంగా ఉండక తప్పవు. అనుకున్న కార్యక్రమాలు సమర్ధవంతంగా పూర్తి చేస్తారు. వ్యాపార వృద్ధి ప్రయత్నాలకు ప్రణాళికలు తయారు చేస్తారు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఇతరులకు సహాయపడటం, అధికారులతో సానుకూలత ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఖర్చులు అదనంగా ఏదో ఒక రూపంలో ఉండి తప్పించుకొనలేరు. ఉద్యోగులు అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. తొందరపాటు వ్యవహారాలతో ఇబ్బందులు పడతారు. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో ఉండవు. ఆదాయం తగ్గుతుంది. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. విద్యార్థులు ఉన్నత విద్య విషయంలో ఆందోళనగా ఉంటారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

పట్టుదల కోపాలను వదలి వ్యవహారాలను సామరస్యంగా పరిష్కరించుకొనండి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. వ్యాపార, వృత్తి జీవనం కలిగిన వారు కొత్త పథకాలు గూర్చిన ఆలోచనలు, ఆదాయమున స్వల్ప పెరుగుదల ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి త్వరలో అవకాశాలుంటాయి. ఉన్నత విద్యావకాశాలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అధికారుల అనుమతులు ఆలస్యం కాగలవు. అనుకున్న పనులకు స్వల్ప ఆటంకాలున్నా, పని పూర్తి చేస్తారు. ఉద్యోగులకు అధికారుల నుండి వత్తిడి ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి కొరకు కొత్త ప్రయత్నాలు చేస్తారు. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. బాకీల విషయంగా వత్తిడులకు లోనుకాగలరు. ఆరోగ్యం బాగానే ఉంటుంది.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారులకు ఉద్యోగులకు ప్రభుత్వ అధికారుల వల్ల ఇబ్బందులుండవచ్చును. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనడం మంచిది. చిరు వ్యాపారవర్గాలకు ఆదాయం పెరుగుతుంది. మిగిలిన వారికి ఆదాయ వ్యయాలు ఫరవాలేదనిపించును. కుటుంబ సభ్యుల మధ్య స్వల్ప విభేదాలుండి సర్దుబాటు కాగలవు. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉన్నత విద్య, శుభకార్యాలపై దృష్టి పెడతారు. వస్తు వాహన గృహ రిపేర్లుండగలవు. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుండగలవు. రావలసిన బాకీలు వసూలు కాగలవు. కుటుంబసభ్యులలో సరైన అవగాహన లేక అభిప్రాయబేధాలు ఏర్పడవచ్చును. అనుకున్న పనులను సాధించుకొంటారు. కొత్త కాంట్రాక్టులు, కొత్త ఏజెన్సీలకు ప్రయత్నాలు చేయండి. జరిగిపోయిన విషయాలు గుర్తు చేసి ఇతరులను బాధపెట్టవద్దు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

గురు, శుక్రవారాలలో ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి. వస్తు వాహన గృహరిపేర్లు ఖర్చులుండగలవు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. కళాక్రీడాకారాలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. విద్యార్థులకు మంచి అవకాశాలు దొరకగలవు. ఆరోగ్యం ఫరవాలేదు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బంధువర్గంతో సమస్యలు రావచ్చును. బంధుముఖ్యుల అనారోగ్య వార్తలు వింటారు. అనుకున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు, అభివృద్ధి తగ్గుతుంది. సంప్రదింపులు, అగ్రిమెంట్ల విషయాలలో ఆలోచించి వ్యవహరించండి. స్థిరాస్తుల వృద్ధికి వ్యాపారవృద్ధికి కొత్త ఆలోచనలు చేస్తారు. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కొత్త పెట్టుబడులకు ప్రయత్నాలు చేయడం, క్రయవిక్రయాలు నిర్ణయం కావడం జరుగుతుంది. ఖర్చులు పెరుగుతాయి. ఆశించినంత ఆదాయముండదు. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగ్గ రాబడి ఉండదు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు. దూర ప్రయాణాలు జరుగుతాయి. చెల్లింపులు సకాలంలో చెల్లిస్తారు. అనుకూలమైన శుభవార్తలు వినడం జరుగుతుంది.

# నెల్లూరు నేతల ఉగాది కవితోత్సవమ్

శ్రీను గల్పిక

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. ఏసి స్టేడియంలో ఉగాది వేడుకల సంరంభం. ఆకర్షణీయంగా వేదికను అలంకరించి వున్నారు. జిల్లా కలెక్టర్ యం.జానకి జ్యోతిప్రజ్వలన చేసి మొదట ఉగాది వేడుకలను ప్రారంభించారు. ఆ తర్వాత వేడుకల నిర్వహణ కోసం ప్రత్యేకంగా విచ్చేసిన యాంకర్ మైకందుకుని... ఈ సిటీ పీపుల్స్ అందరికీ హ్యాపీ ఉగాది... ఇది తెలుగు ఇయర్ ఓపెనింగ్ డే... కాబట్టి మనమందరం గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోవాలి... అసలు ఉగాది అంటే ఏంటో తెలుసా... మామిడికాయ, వేపకాయ, చింతకాయలు మిక్సీలో వేసుకుని చట్నీ చేసుకోవాలి. ఆ చట్నీని రైస్‌లో కలుపుకుని తింటే ఆ టేస్టే వేరు... ఫ్రూట్ మిక్సింగ్ చట్నీ తినడాన్నే ఉగాది అంటారని చెప్పింది. ఆ మాటలకు అక్కడున్న వాళ్ల తలలన్నీ గిర్రున తిరిగాయి. తర్వాత కొన్ని డ్యాన్స్ గ్రూపుల వాళ్లు మైకేల్ జాక్సన్, దిలార్ మెహందీ, ఉదిత్ నారాయణ పాటలకు డ్యాన్సులు చేశారు. ఆ తర్వాత బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు పంచాగ శ్రవణం వినిపించారు. చంద్రబాబు పాలనలో ఆదాయం 2గాను ఖర్చు 22గాను ఉంటుందని, ప్రస్తుత పరిణామాలే అందుకు ఉదాహరణ అని ఆయన విడమరచి చెప్పారు. తర్వాత జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మైకందుకుని ఇప్పుడు ఉగాది కవితాగానం మొదలవుతుందని చెప్పి, మొదట ఆయనే కవిత చెప్పసాగాడు....

**అబ్బబ్బా ఇవి ఎండలా**
**నెత్తిన పడుతున్న బండలా...**
**పొయ్యి మీద వంట**
**రోడ్డు మీద మంట**
**ఇంట్లోనేమో పొగలు**
**వీధిలోనేమో సెగలు**
**ఇంట బయట ఒకటే ఉక్క...**
**ఎక్కడున్నా వడదెబ్బ పక్కా...** అంటూ ముగించాడు.

తర్వాత ఎస్పీ విశాల్‌గున్ని అచ్చ తెలుగు పంచె కట్టుతో వేదికనెక్కి మైకు తీసుకుని...

**వచ్చాడు వచ్చాడు విశాల్ గున్ని...**
**అరాచక శక్తుల ఆట కట్టిస్తాను తన్ని**
**ఎత్తాను లాఠీ.. ఆపుతాను పెద్దోళ్ల లూఠీ**
**భయపెడుతున్న నెల్లూరుట్రాఫిక్**
**ఇక నన్ను చూస్తే దానికి టెర్రిఫిక్!**
**రౌడీ, గూండా బ్రదర్...**
**నెల్లూర్లోనే ఉంటే మీ పని ఇక అదుర్స్...** అంటూ ముగించాడు. తర్వాత మేయర్ అబ్దుల్ అజీజ్ వంతు వచ్చింది.

**ఎంతో అందమైనది నా సింహపురి**
**భూమ్మీద వెలసిన యమపురి**
**ముదురుదోమలు సింగారం**
**సందుల్లో పందులే బంగారం**
**వీధివీధినా చెత్తకుప్పలు**
**మా నగరానికి అవే గొప్పలు**
**జగమెరిగిన కరాటే ఫైటర్లు**
**నెల్లూరు మున్సిపల్ కార్పొరేటర్లు**

అని చెప్పి దిగాడు. తర్వాత నైట్‌రైడర్, ముదురు దోమల మంత్రి నారాయణ మైకందుకుని...

**చీకటంటే నాకెంతో ఇష్టం**
**సూర్యుడంటే నాకు కష్టం**
**పనిలోన నైట్‌కింగ్‌ను**
**పగలేమో బొంగును**
**సింగపూర్‌ను చుట్టేసా...**
**టోక్యోను మడత పెట్టేసా...**
**అమరావతిని కట్టేసా...**

అని చదివి దిగేశాడు.

తర్వాత సోమిరెడ్డి వేదికనెక్కి...

**అనుకున్నామని జరగవు అన్నీ**
**అనుకోలేదని ఆగవు కొన్ని**
**లోకేష్ మంత్రి కావాలి**
**ఇది నా నోటిలో మాట..**
**నాకూ ఓ మంత్రి పదవి కావాలి**
**ఇది మనసులో మాటా..**
**విమర్శలు చేయడంలో నాకు నేనే సాటి**
**జగన్‌ను తిట్టడంలో నాకెవరున్నారు పోటీ...**
**జగన్‌ను తిట్టడమే మంత్రి పదవికి కొలమానం**
**అందుకే నాకివ్వాలి బహుమానం**

అంటూ ముగించాడు.

తర్వాత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెళ్లి...

**ఎమ్మెల్యే సోదరులారా...**
**భావిభారత కాంట్రాక్టర్లారా...**
**జీతాలెందుకు గీతాలుండగా...**
**జీతాలెందుకు మద్యం షాపులుండగా..**
**జీతాలెందుకు ఇసుకరీచ్‌లుండగా...**
**జీతాలెందుకు అధికారుల బదిలీలుండగా...**
**జీతాలెందుకు ఎర్రచందనం చెట్లుండగా...**
**జీతాలెందుకు మిమ్మల్ని -**
**కోట్లు పెట్టి కొనే పార్టీలుండగా...**

అని చదివి ముగించాడు. ఆ తర్వాత సి.వి. శేషారెడ్డి మైకందుకుని చేతిలో సోనియాగాంధీ ఫోటో పెట్టుకుని చూస్తూ...

**అమ్మా,**
**అడగ్గానే సభ్యత్వమిచ్చావ్,**
**అడక్కుండానే పార్టీ టికెట్టిచావ్,**
**మాట్లాడ్డానికి మైకిచ్చావ్,**
**వాడుకోవడానికి ఇందిరాభవన్‌నిచ్చావ్**
**ఉద్యమాలు చేయడానికి ఊపిరినిచ్చావ్**
**లాఠీదెబ్బలు తినడానికి వీపునిచ్చావ్**
**ఎగరేయడానికి జెండాలిచ్చావ్**
**స్థంభాలెక్కి కట్టడానికి బ్యానర్‌లిచ్చావ్...**
**అయినా ఎందుకమ్మా...**
**రాహుల్‌ను మాకు నేతగా ఇచ్చావ్...!**

అంటూ ముగించాడు.

అప్పుడే వచ్చిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు వేదికనెక్కి మైకందుకుని...

**ఉగాది వచ్చె ఉషస్సు తెచ్చె**
**కోయిల పిలుపు... చింతపండు పులుపు**
**మామిడి వగరు... వేపపువ్వు పొగరు...**
**ఇదేరా ఉగాది... ఇదేరా తెలుగు సంవత్సరాది.**
**ఉప్పు, పప్పు, కాలికింద చెప్పు**
**గోడ మేకుకు పట్టింది తుప్పు**
**వదిలించకుంటే అది మన తప్పు**
**మోడీ మనకు దేవుడు**
**ఆయనే కలియుగ రాముడు**
**అని చెబుతున్నాడు ఈ వెంకయ్యనాయుడు**

అని చెప్పి దిగాడు. వెంటనే స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(65+) వేదికనెక్కి మైకందుకుని...

**దుర్ముఖి నా ఇష్టసఖి..**
**రాహుకాలంతో నాకు స్నేహం**
**యమగండమంటే నాకు ప్రాణం**
**అమావాస్య నా కిష్టమైన దినం**
**ఆరోజే ఏపనైనా నాకు ఫలప్రదం**
**అందరికీ అశుభమైనది నాకు శుభం...**
**అందరికీ శుభమైనది నాకు అశుభం**
**నలుగురికి నచ్చింది నాకసలే నచ్చదు**
**నాకు నచ్చినది ఎవరికీ నచ్చదు**
**నా దారి అడ్డదారి**
**అడ్డొస్తే అడ్డంగా లేపేస్తా మరి...**

అంటూ ముగించాడు.

ఈ కవితోత్సవం మొదలైనప్పటి నుండి ప్రేక్షకులు అదే పనిగా చప్పట్లు కొడుతూనే వున్నారు. చివరగా కలెక్టర్ జానకి మైకందుకుని... మీ అభిమాన నేతల కవితలకు మీ రియాక్షన్ చాలా బాగుంది. ఆపకుండా చప్పట్లు కొడుతూ ఎంకరేజ్ చేసారని అంది. ఆ మాటకు సభలో నుండి ఓ వ్యక్తి లేచి... మేడమ్, మేం చప్పట్లు కొట్టింది వాళ్ల కవితలు బాగున్నాయని కాదు, ఈ పాడు మున్సిపాల్టీ వాళ్లు ఇక్కడ ఫాగింగ్ చేసినట్లు లేదు. ముదురుదోమలు ఒంటిని పీకి పెడుతుంటే అందరం వాటిని చంపుకుంటున్నాం. మీరు పొరపాటున చప్పట్లు కొట్టామనుకుంటున్నారు. కావాలంటే చూడండి మా చేతులు ఎలా రక్తమయ్యాయో... అని తన చేతులు చూపించాడు. ఆ చేతులు రక్తంలో ముంచినట్లు ఎర్రగా ఉన్నాయి... అది చూసి అందరూ నోర్లు వెళ్లబెట్టారు.

# జడ్పీ వాకర్స్ ఉగాది వేడుకలు



నెల్లూరులోని జడ్పీ వాకర్స్ సంఘం వారు ఈనెల 9వ తేదీ ఎపిహెచ్‌బి కాలనీలో శ్రీ దుర్ముఖినామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంఘం కార్యదర్శి జెయస్ఆర్ ఆంజనేయులు స్వాగతం పలుకగా చెలంచర్ల భాస్కరరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా॥ ఏవియస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మధుర కవి బి.రామిరెడ్డి, మాజీ కార్యదర్శి మండవ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు టి.వి.రమణారావు, కోశాధికారి సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా డాక్టర్ ఏవియస్ ప్రసాద్‌ను, ఆదర్శ దంపతులు బి.ఆర్.శ్రీధర్ – సింధు, మాజీ కార్యదర్శి మండవ శ్రీనివాసరావును ఆయన సతీమణి విజయకుమారిని శాలువాలతో సంఘం తరపున సన్మానించారు. అనంతరం 75 ఏళ్లు పైబడిన సభ్యులు రత్నం, వాసుదేవయ్య, సిఆర్ రాఘవ, వెంకయ్యలను దుశ్శాలువాలతో సత్కరించారు. యం.వి.కృష్ణయ్య వందన సమర్పణ చేశారు.

# ఆ నలుగురు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి. రెడ్డి వర్గానికి ఒక మంత్రి పదవిని మాత్రం నెల్లూరు లేదా ప్రకాశం జిల్లాల నుండి తీసుకోవాలి. ఈ రెండు జిల్లాల నుండి వినిపిస్తున్న పేర్లు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి. న్యాయంగా, ధర్మబద్ధంగా పార్టీకి చేసిన కృషిని పరిశీలనలోకి తీసుకుని మంత్రి పదవి ఇవ్వాల్సి వుస్తే అందుకు మొదటి అర్హుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ఎందుకంటే అతను 1992 నుండి తెలుగు దేశంను కనిపెట్టుకునే ఉన్నాడు. పార్టీ అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా జంపింగ్‌లు చేయలేదు. పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లు కూడా జిల్లా పార్టీలో అంతా తానై పని చేశాడు. పార్టీ అధిష్టానం ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీచేస్తూ, పరాజయాలను చవిచూస్తూ అన్ని విధాలుగా నష్టపోయాడు. అయినా తన రాజకీయ అనుభవంతో ప్రతిపక్షంలో వున్నప్పుడు అధికారపార్టీని, ఇప్పుడు అధికారంలో వుంటే ప్రతిపక్షాన్ని పదునైన విమర్శలతో ఎండగడుతూ మంత్రివర్గంలో తనలాంటి సీనియర్ అవసరం ఎంతుందో చెప్పకనే చెబుతున్నాడు.

మాగుంట శ్రీనివాసులురెడ్డి చూస్తే కరెక్ట్‌గా 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విడిచేసి తెలుగుదేశంలో చేరాడు. ఒంగోలు ఎంపి అభ్యర్థిగా ఓడిపోయాడు. ఇటీవల ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలిచాడు. చంద్రబాబు మంత్రి పదవి హామీ ఇచ్చినందువల్లే ఆయన ఎమ్మెల్సీగా నిలబడ్డాడని టాక్! మరి చంద్రబాబు ఆ హామీని ఎంతవరకు నిలబెట్టుకుంటాడో చూడాలి. ఇటీవలే ఆనం సోదరులు తెలుగు దేశంలో చేరారు. నెల్లూరుజిల్లాలో సోమి రెడ్డి నాయకత్వాన్ని పక్కనపెట్టి ఆనం బ్రదర్స్‌కు అప్పగించేందుకే వారిని పార్టీలోకి తీసుకున్నారని పార్టీ వర్గాలంటున్నాయి. ఆనం బ్రదర్స్‌తో జిల్లాలో పార్టీ బలపడుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన కాంగ్రెస్ కేడర్‌ను ఆనం రామనారాయణరెడ్డి పార్టీలోకి లాక్కురాగలడని చంద్రబాబు నమ్ముతున్నాడు. ఆనం రామ నారాయణ రెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి వర్గంలోకి తీసుకోవచ్చనే వూహాగానాలున్నాయి. ఇదే జరిగితే రాజకీయాలలో ఇదో వండర్ అవుతుంది. తన పార్టీలో దశాబ్దాల తరబడి చాకిరిచేస్తున్న వారిని ఎండగట్టి పక్కపార్టీ వాళ్లను పిలిచి మంత్రిపదవి ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. మరి చంద్రబాబు ఆ లెవల్‌కు దిగజారుతాడా? ఏమో... ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో అన్నీ ఇలాంటివే జరుగుతున్నాయి. ముందొచ్చిన చెవులకంటే వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లుగానే వుంది తెలుగుదేశం పరిస్థితి. బలహీన వర్గాల నుండి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కూడా ఆశావాదుల జాబితాలో ఉన్నాడని తెలుస్తోంది.

# తీర్థ చిల్డ్రన్స్ 'గ్రాడ్యుయేషన్ డే'



నెల్లూరు మనుమసిద్ధినగర్‌లోని తీర్థ చిల్డ్రన్స్ హోం స్కూల్‌లో ఈనెల 6వ తేదీ "గ్రాడ్యుయేషన్ డే"ను ఘనంగా జరుపుకున్నారు. స్కూలు కరస్పాండెంట్ యం.ద్వారకానాథ్, ప్రిన్సిపల్ యం.సాయికుమారి, స్కూల్ ఇన్‌ఛార్జ్ బి.శ్రీనివాసులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఉత్తీర్ణులైన ప్రైమరీ విద్యార్థులు, సెకండరీ స్టేజీకి, సెకండరీ విద్యార్థులు హైస్కూలుకు, హైస్కూలు అయిపోయిన విద్యార్థులకు 'గ్రాడ్యుయేషన్ డే' నిర్వహిస్తామని, దీనినే కాన్వొకేషన్ డే లేదా ఇన్‌వొకేషన్ డే అని కూడా అంటారని తెలిపారు. ఇలాంటి రోజు మరుపురాని రోజుగా, తీపిగుర్తుగా జీవితంలో ఉండిపోయే రోజుగా విద్యార్థులు భావిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులందరికీ మేనేజ్‌మెంట్ వారు సర్టిఫికేట్లు బహుకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నందమూరి చిచ్చు

(మొదటి పేజీ తరువాయి)

బాలకృష్ణను వీలైతే రాష్ట్రంలో లేకుండా రాజ్యసభ ఇచ్చి ఢిల్లీకి పంపించాలనే ప్లాన్ కూడా వుంది. జై సమైక్యాంధ్ర ఉద్యమంలో రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన నందమూరి హరికృష్ణ మళ్ళీ రాజ్యసభను ఆశిస్తున్నాడు. ఇటీవల చంద్రబాబుకు హరికృష్ణ కుటుంబానికి గ్యాప్ వచ్చింది. బాబు మీద వీళ్లకు బాగానే అసంతృప్తి వుంది. కాని తమ తండ్రి స్థాపించిన పార్టీలో తమకూ హక్కుందనే కోణంలో హరికృష్ణ రాజ్యసభను కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే హరికృష్ణను పూర్తిగా సైడ్ చేయాలని, ఆయన వల్ల తనకు గాని, పార్టీకి గాని ఉపయోగం లేదని చంద్రబాబు ఆలోచన. అందుకే హరికృష్ణకు చెక్ పెట్టడానికి బాలకృష్ణను రాజ్యసభకు పంపవచ్చని సమాచారం. ఈ మార్పులు త్వరలోనే చోటు చేసుకోనున్నాయి. తనకు రాజ్యసభ రాకపోతే మాత్రం నందమూరి హరికృష్ణ కుటుంబసభ్యులు రాజకీయంగా తిరగబడే అవకాశాలున్నాయి.




# పోలీసుల తల్లిదండ్రులకు ఆరోగ్య భద్రత



పోలీసు శాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య భద్రతలోకి పోలీసుల తల్లిదండ్రులను కూడా ప్రభుత్వం చేర్చిందని జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తెలిపారు. 9వ తేదీ నెల్లూరులోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు పోలీసుల విజ్ఞప్తిని మన్నించి తల్లిదండ్రులకు అవకాశం కల్పించారన్నారు. ఈ సందర్భంగా సిఎంకు, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్పకు, డిజిపి జేవి రాముడికి అసోసియేషన్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. హోంగార్డుల జీతాలు రూ.300లు నుంచి రూ.400లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. రిస్క్ అలెవెన్స్‌ను మూలవేతనంలో 10శాతం ఇవ్వడంతో పాటు ట్రాఫిక్, సిఐడి, ఇంటెలిజన్స్ సిబ్బందికి 30శాతం అలవెన్సు, పోలీసు సబ్సిడి క్యాంటిన్‌లో 14.5శాతం వ్యాట్ మినహాయింపు, ఆర్టీసీ బస్‌పాసులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తురకా శ్రీనివాసులు, ఎస్‌పి ప్రసాద్, రమణయ్య, లక్ష్మీపతి పాల్గొన్నారు.

# శాకాంబరిగా భువనేశ్వరి అమ్మవారు

- బంగారు చీరలో రాజరాజేశ్వరమ్మ
- నగరోత్సవంలో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని ఆలయాలు 8వ తేదీ భక్తులతో కిటకిటలాడాయి. మూలాపేట శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో భువనేశ్వరి అమ్మవారు శాకాంబరి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో దేవస్థానాన్ని ఆకట్టుకునేలా అలంకరించారు. దేవస్థానంలో ఆధ్యాత్మిక భాస్కర కోట రాధాకృష్ణమూర్తి పంచాంగ పఠనం చేశారు. అనంతరం శివపార్వతుల కళ్యాణం కమనీయంగా జరిగింది. స్వామి అమ్మవార్లకు విశేషంగా పుష్పయాగం నిర్వహించారు.

దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు బంగారు చీర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుందరేశ్వర స్వామికి పాలాభిషేకం, అమ్మవారికి ఖడ్గమాల స్తోత్రపూజలు నిర్వహించారు. వేదపండితులు ఆలూరు శిరోమణిశర్మ పంచాంగ పఠనం చేశారు. సాయంత్రం అమ్మవారికి కుంభహారతులు, పల్లకి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారు నిజరూప చందనాలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. సాంప్రదాయం ప్రకారం రంగనాయకులపేటలోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానం నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారెలు సమర్పించారు. విశేష అలంకారంలో అమ్మవారు నగరోత్సవంలో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### కె.వి.నాగేశ్వరరావు దంపతులకు

# మానస సాహిత్య అవార్డు



నెల్లూరుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, కవి, రచయిత, నటుడు రెవెన్యూ ఉద్యోగి కె.వి.నాగేశ్వరరావుకు, ఆయన సతీమణి కె.సరస్వతికి విజయవాడకు చెందిన మానస సాహిత్య సాంస్కృతిక అకాడమి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన శ్రీ దుర్ముఖి నామ సంవత్సరం-2016 ఉగాది కవితల పోటీల్లో వారు వ్రాసిన "కాలం కాటేసింది", "ఇదెక్కడి న్యాయం" కవితలకు ఉత్తమ కవితా పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా ఈ నెల 10వ తేదీన విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో పై సంస్థ వారు కె.వి.నాగేశ్వరరావు, సరస్వతిలను శాలువా, మెమొంటో, నగదు అవార్డులతో ఘనంగా సత్కరించారు. ఈ సభలో సినీ దర్శకులు పి.యం.సుందరరావు, సినీ నటులు పిళ్ళా ప్రసాద్, సంస్థ అధ్యక్షులు బ్రహ్మానందరావు తదితరులు పాల్గొన్నారు.

### గూడూరు...

# ముక్కోణపు వర్గపోరు!

*రాజకీయాలు పేకాటలాంటివి. ఇక్కడ కింగ్ వచ్చిన వాళ్ళు కింగ్‌లు కాలేరు, జోకర్ వచ్చినవాళ్లే కింగ్‌లవుతారు. అలాంటి జోకర్ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు వచ్చింది. ఒక్కసారిగా గూడూరు రాజకీయాల్లో కింగ్ అయిపోగా, ఎంతో కాలంగా జోకర్ కోసం ఎదురు చూస్తున్న బల్లి దుర్గాప్రసాద్, బి.జ్యోత్స్న లతలు మాత్రం ఈ పేకాట్లో అంతా పోగొట్టుకుని... "అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయనే... జేబులు ఖాళీ ఆయనే' అని పాడుకుంటున్నారు.*







పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిందన్న చందంగా గూడూరులో బల్లి దుర్గాప్రసాద్, జ్యోత్స్నలతల మధ్య నెలకొన్న వర్గపోరును పాశం సునీల్‌కుమార్ తీర్చాడు. చంద్రబాబు అభివృద్ధికి విపరీతంగా ఆకర్షితుడై సునీల్‌కుమార్ తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! ఆయన చేరీ చేరగానే గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాధ్యతలను కూడా తెలుగుదేశం అధిష్టానం ఆయనకే అప్పగించేసింది. ఇప్పటిదాకా పార్టీని కనిపెట్టుకుని వున్న బల్లి దుర్గాప్రసాద్, జ్యోత్స్నలతలను పక్కన పెట్టేసింది.


గూడూరుకు చాలా పాతకాపు బల్లి దుర్గాప్రసాద్. 2014ఎన్నికల్లో సీటు అతనికివ్వకుండా డాక్టర్ జ్యోత్స్నలతకిచ్చారు. బల్లి దుర్గాప్రసాద్ ఇండిపెండెంట్‌గా నిలబడ్డాడు. ఈ ఇద్దరి మధ్య ఓట్లు చీలి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన పాశం సునీల్‌కుమార్ గెలిచాడు. ఎమ్మెల్యే అయిన రెండేళ్ళకే సునీల్ తెలుగుదేశంలోకి వచ్చాడు. ముందస్తు ఒప్పందం ప్రకారం ఇక అధికారిక కార్యక్రమాలన్నింటిలో సునీల్‌కే ప్రాధాన్యత. మరి బల్లి, జ్యోత్స్నలతల నోట్లో మట్టేనా?

# 'నాట్య మయూరి' సుమేధ



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, టివి ఆండ్ చలచిత్ర సహకారంతో ఈ నెల 10వ తేదీ ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బివిఆర్ కళాకేంద్ర సంస్థ వ్యవస్థాపకులు బుద్దా వెంకటరామారావు ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు, 23వ జాతీయ స్థాయి నాటిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి కళాకారిణి చిన్నారి రేణిగుంట సుమేధకు 'నాట్య మయూరి' బిరుదును జిల్లా పరిషత్ ఛైర్మెన్ బాపిరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ప్రదానం చేసి శాలువా, పూలమాల, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ ప్రముఖులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



## నెల్లూరుకు రాజ్యసభ యోగం ఉందా?

# గురువుకా? శిష్యుడికా?





**ఎక్కడైనా మామే కాని వంగతోట కాడ మామ కాదు అనే సామెత వుంది. ఇది రాజకీయాలకు కూడా వర్తిస్తుంది. ఇంట, బయటా గురుశిష్యులు, అన్నదమ్ముల అనుబంధాలుంటాయిగాని, రాజకీయాలలో మాత్రం అలాంటి బంధాలకు తావులేదు. పదవుల విషయం వచ్చేసరికి అన్నదమ్ములే విరోధులవుతారు. మిత్రులే శత్రువులవుతారు. ఇప్పుడు ఇలాంటి సీనే జిల్లా తెలుగు దేశంలోనూ చోటు చేసుకోబోతోంది.**

రాష్ట్రంలో రాజ్యసభ రేస్ మొదలైంది. వచ్చే నెలలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఏపిలో ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పుడున్న ఎమ్మెల్యేల స్కోర్‌ను లెక్కలోకి తీసుకుంటే తెలుగుదేశంకు మూడు, వైకాపాకు ఒకటి రాజ్యసభ స్థానాలు దక్కుతాయి. తెలుగుదేశంకు వచ్చే మూడింటిలో ఒక దాని కోసం మాత్రం మన జిల్లా నాయకులు ట్రై చేసుకుంటున్నారు. వీరిద్దరూ గురుశిష్యులే! మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే, రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావులు రాజ్యసభ ప్రయత్నాలలో ఉన్నారు. బి.సి సామాజికవర్గం నుండి తనకు అవకాశం కల్పించాలని బీద మస్తాన్‌రావు కోరుతున్నాడు. 1999 నుండి పార్టీలో వుంటూ ఆర్ధికంగా ఎంతో ఖర్చు పెట్టుకున్నాడు. ఓడినా గెలిచినా పార్టీలోనే వున్నాడు. అయితే ఇటీవలే ఆయన సోదరుడు బీద రవిచంద్రకు ఎమ్మెల్సీ ఇచ్చారు. కాబట్టి మళ్లీ అదే ఇంట్లో రాజ్యసభ ఎలా ఇస్తారనే సందేహం కూడా వుంది. అయితే రవిచంద్రకు ఎమ్మెల్సీ ఇచ్చేటప్పుడే ఈ సాకుతో తన రాజ్యసభ ఆశలను నీరుగార్చొద్దని అధిష్టానానికి మస్తాన్‌రావు గట్టిగా చెప్పాడని తెలుస్తోంది. అదీగాక బీద సోదరుల పట్ల చంద్రబాబుకు సానుకూల దృక్పథం వుంది. అందుకని నెల్లూరుజిల్లా నుండి అవకాశం ఉంటే అది బీదకే వుండొచ్చని సమాచారం. ఎందుకంటే రేపు మంత్రివర్గ విస్తరణ జరిగితే ఈ జిల్లా నుండి రెడ్డి వర్గానికి చోటు ఇవ్వొచ్చు. కాబట్టి రాజ్యసభను అదే వర్గం వారికి ఇవ్వడని టాక్!

కాని రాజ్యసభపై ఆదాల గట్టి పట్టుదలతో ఉన్నాడు. 2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి కేవలం 13వేల ఓట్ల తేడాతో ఓడిపోయాడు. ఆరోజు నెల్లూరు రూరల్ బీజేపీకి ఇవ్వకున్నా, ఆత్మకూరులో గట్టి అభ్యర్థిని పెట్టున్నా ఆదాల బయటపడుండేవాడు. పార్టీ అధిష్టానం అభ్యర్థుల ఎంపికలో చేసిన పొరపాట్లకు ఆదాల బలయ్యాడు. కాబట్టి తనకు న్యాయం చేయాలన్నది ఆయన డిమాండ్. నెల్లూరుజిల్లాకు అవకాశమిస్తే రాజ్యసభను తనకివ్వాలని కోరుతున్నాడు. ఈమధ్య పార్టీ కార్యక్రమాలలో కూడా చురుకుగానే వుంటున్నాడు. నెల్లూరు పార్లమెంటు మరియు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తూ... వైకాపా నాయకులను ఎక్కువ సంఖ్యలో తెలుగుదేశంలో చేర్పించేందుకు కృషి చేస్తున్నాడు. ఇటీవల కాంగ్రెస్ నుండి తెలుగు దేశంలోకొచ్చిన వారికి చంద్రబాబు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాడు. కాబట్టి ఆ కోటాలో ఏమన్నా ఆదాలకు ఛాన్స్ తగిలినా తగలొచ్చు.

# అధ్యయనంతోనే మంచి కవిత్వం

## - నెరసం సభలో ఏజేసి రాజ్‌కుమార్



ఏ కవికైనా..రచయితకైనా అధ్యయనంతోనే మంచి కవిత్వం వస్తుందని, రచనల్లో బాగా రాణించాలంటే నిరంతరం సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ఎంతో ముఖ్యమని ఏజేసి రాజ్‌కుమార్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో శనివారం స్థానిక టౌన్‌హాల్ ప్రాంగణంలోని హాల్‌లో జరిగిన ఉగాది పురస్కార వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాష, సంస్కృతి ఎంతో సమున్నతమైనవని, వాటిని పదికాలాల పాటు పదిలపరుచుకుని భావితరాలవారికి అందించాల్సిన బాధ్యత మనందరిపై వుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, సాహిత్యానికి పెద్దపీట వేయడంలో, మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడంలో తన తండ్రిగారు..'లాయర్' వ్యవస్థాపకుడైన తుంగా రాజగోపాలరెడ్డి స్ఫూర్తే తమకు మార్గదర్శకమని, ఆ ఆశయాల బాటలోనే 'లాయర్' వారపత్రిక నేటికీ పయనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గురుబ్రహ్మ, ఎస్‌ఆర్‌కె స్కూల్ అధినేత పి.కృష్ణమూర్తి, ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఆచార్య ఆదిత్య, నెరసం అధ్యక్ష కార్యదర్శులు ఎ.జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావును నెరసం తరఫున ఘనంగా సత్కరించి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారికి, కవులకు నెరసం ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ పురస్కారాలందుకున్నవారిలో ప్రముఖ కవి మాటేటి రత్నప్రసాద్, బాలసాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్, బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి, 'లాయర్' వారపత్రిక సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు, వాత్సల్య అనాధాశ్రమ నిర్వాహకులు జివి సాంబశివరావు, చాట్ల సర్వీసెస్ అధినేత నవీన్, యునెస్కో అవార్డు గ్రహీత అనిమేష్ వున్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com